జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



కావలెను

రాష్ట్ర వ్యాప్తంగా నూతన శకాన్ని లిఖించబోతున్న

పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి

ఆంధ్రప్రదేశ్ 175 నియోజకవర్గాల నుంచి 175 మంది వాలంటీర్స్ ని నియమిస్తుంది.

ప్రతి వాలంటీర్ కు

నెలకు Rs.25,000/-

Salary ఇవ్వబడును.

విద్యా, వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా వాలంటీర్ గా చేరవచ్చు.

ఆసక్తి గలవారు మీ బయోడేటాను ఆధార్ కార్డు తో సహా

మీ ప్రాంతంలో ఉన్న పార్టీ లీడర్స్ ని సంప్రదించవచ్చు.

లేదా ఈ క్రింది నెంబర్

7660027683 కి వాట్సాప్ చేయగలరు.



సంపుటి 15 సంచిక 344 విశాఖపట్నం | శుక్రవారం 11 ఆగష్టు 2023 | 8 పేజీలు | వెల : 5.00


## ఆప్కాబ్‌లో గతంలో చూడని పురోగతి

### ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, కేంద్ర సహకార బ్యాంకులపై జగన్ సమీక్ష



అమరావతి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, కేంద్ర సహకార బ్యాంకులపై సీఎం వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీఏసీఎస్‌లు, డీసీసీబీలు, డీసీఎంఎస్‌ల బలోపేతంపై చర్చించారు. సీఎం జగన్‌సమీక్షలో కీలక అంశాలపై చర్చించారు."గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండాలంటే రైతులు, మహిళల ఆర్థిక స్థితిగతులు బలంగా ఉండాలి.పీఏసీఎస్‌లు, డీసీసీబీలు, డీసీఎంఎస్‌ల నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయాలి. వ్యవసాయ కార్యకలాపాలకు, మహిళల స్వయం ఉపాధి కార్యక్రమాలకు తక్కువ వడ్డీకే రుణాలు అందించాలి. ఈ లక్ష్యసాధనలో ఆప్కాబ్, జిల్లాకేంద్ర సహకార బ్యాంకులు, పీఏసీఎస్‌లు, ఆర్బీకేలు భాగస్వామ్యం చేసి..వీటి నెట్‌వర్క్‌ను కూడా విస్తృతం చేయాలి. ఆర్బీకేల రూపంలో ప్రతి గ్రామంలో కూడా ఆప్కాబ్‌కు, జిల్లాకేంద్ర బ్యాంకులకు శాఖలు ఉన్నట్టే.మరే ఇతర బ్యాంకుకు లేని అవకాశం సహకార బ్యాంకులకు మాత్రమే ఉంది.వీటి ద్వారా కార్యకలాపాలను మరింత ముమ్మరం చేయాలి.ఈ లక్ష్యం దిశగా పీఏసీఎస్(ప్యాక్స్), డీసీసీబీ, డీసీఎంఎస్, ఆప్కాబ్‌లు వాటి కార్యకలాపాలు పెంచాలి.ఆప్కాబ్‌లో గతంలో చూడని పురోగతి కనిపిస్తోంది.ఆప్కాబ్ మన బ్యాంకు దీన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలి" అని అధికారులకు సీఎం జగన్ ఆదేశించారు.

## వీగిపోయిన అవిశ్వాస తీర్మానం..

### పెట్టేదేదో సరిగ్గా పెట్టొచ్చు కదా అంటూ మోదీ ధ్వజం

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం లోక్‌సభలో వీగిపోయింది. గురువారం సాయంత్రం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగం అనంతరం స్పీకర్ ఓం బిర్లా మూజువాణీ ఓటింగ్ నిర్వహించగా.. అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించారు. మోదీ ప్రసంగిస్తున్న సమయంలోనే లోక్‌సభలో విపక్షాలు వాకౌట్ చేయడంతో.. ఓటింగ్ లేకుండానే అవిశ్వాసం వీగిపోయింది. అంతకుముందు.. ఈ తీర్మానంపై లోక్‌సభలో వాడీవేడీ చర్చ కొనసాగింది. అధికార, విపక్ష పార్టీలు విమర్శ, ప్రతివిమర్శలు చేసుకున్నారు. ఒకరిపై మరొకరు కౌంటర్ల వర్షం కురిపించుకున్నారు. చివరగా మోదీ ప్రసంగిస్తూ.. కాంగ్రెస్‌తో పాటు విపక్ష పార్టీల్ని ఎండగట్టారు.2018, 2023లో విపక్షాలు అవిశ్వాసం పెట్టాయని.. కనీసం పెట్టేదైనా



సరిగ్గా పెట్టొచ్చు కదా అని ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అసలు అవిశ్వాసం ఎందుకు పెడుతున్నారనే విషయంపై విపక్షాలకు స్పష్టత గానీ, సంసిద్ధత గానీ లేదని చురకలంటించారు. భవిష్యత్తులో మరోసారి అవిశ్వాసం పెట్టాలని అనుకుంటే.. అప్పుడైనా సంపూర్ణ సింసిద్ధతతో వస్తారని ఆశిస్తున్నానంటూ ఎద్దేవా చేశారు. ఈ సభ సభ ప్రజల సొమ్ముతో నడుస్తోందని, కాబట్టి ప్రతీ క్షణం ఎంతో విలువైనదని అన్నారు. ప్రజల ధనాన్ని, సభా సమయాన్ని దుర్వినియోగం చేయకూడదని హితవు పలికారు. రాజకీయాలు బయట చేయాలే తప్ప సభలో కాదని.. దేశాభివృద్ధి, సమగ్రత కోసం ఫలవంతమైన చర్చలు జరగాలని.. అందుకు విపక్షాలు సహకరించాలని ప్రధాని మోదీ కోరారు. 1991లో భారత్ అప్పుల కోసం ప్రపంచం వైపు చూసిందని.. కానీ 2014 తర్వాత స్థిరమైన ఆర్థిక వ్యవస్థగా నిలదొక్కుకుందని మోదీ పేర్కొన్నారు. రిఫార్మ్, పర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ అనే పద్ధతిలో తాము భారతదేశాన్ని ముందుకు నడిపిస్తున్నామని.. తమ పనితీరు, నిబద్ధతతోనే దేశాన్ని మూడో ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టి తీరుతామని ఉద్ఘాటించారు. డిజిటల్ ఇండియా గురించి మాట్లాడినప్పుడు విపక్షాలు అవహేళన చేయాలని.. కానీ ఇప్పుడు డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ ఏ స్థాయికి వెళ్లిందో అందరూ చూస్తూనే ఉన్నారని అన్నారు. దేశపు సామర్థ్యం, ప్రజల సామర్థ్యం మీద విపక్షాలకు ఏమాత్రం విశ్వాసం లేదని మండిపడ్డ మోదీ.. అహకంకారంతో కాంగ్రెస్ కళ్లు మూసుకుపోయాయని విజృంభించారు.

## పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్

## కేటాయింపులు లేవ్.. అనుమతులు లేవ్..



అమరావతి,: తెలంగాణలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న పాలమూరు- రంగారెడ్డి పథకంపై నేషనల్ గ్రీన్ -ట్రైబ్యునల్‌తో పాటు- సుప్రీంకోర్టుకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) అఫిడవిట్ రూపంలో కీలక నివేదిక అందించినట్టు- తెలిసిం ది. తాగునీటి పథకం పేరుతో తెలంగాణ ప్రభుత్వం భారీ సాగునీటి పథకాన్ని నిర్మి స్తోందని అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఏపీ ప్రభుత్వం వ్యాజ్యం దాఖలు చేసిన నేపథ్యం లో ఇటీ-వల సుప్రీంకోర్టు బోర్డుకు నోటీ-సులు జారీ చేసింది. ఈ మేరకు కృష్ణా బోర్డు అఫిడవిట్ దాఖలు చేసినట్టు- తెలిసింది. 7.15 టీ-ఎంసీల తాగునీటి తరలింపు నకు లిఫ్టులు, కాల్వలు, నిల్వ సామర్థ్యానికి మించి జలాశ యాల నిర్మాణాలు ఉన్నాయని బోర్డు వెల్లడించినట్టు- సమాచారం. అనుమతులు లేకుండా పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మిస్తున్నారంటూ కడప జిల్లాకు చెందిన వెంకటయ్యతో పాటు- మరికొందరు రైతులు ఎన్జీటీ-లో పిటిషన్ దాఖలు చేయగా ఏపీ ప్రభుత్వం కూడా ఆ వ్యాజ్యాల్లో ఇంప్లీడ్ అయింది. రాయ లసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలుపు దల చేసే దాకా తెలంగాణ ప్రభుత్వం ఎలా వెంటాడిందో పాలమూరు-రంగారెడ్డిపైనా ఏపీ ప్రభుత్వం అదే వైఖరి అవలంబించి నేషనల్ గ్రీన్ -ట్రైబ్యునల్‌ను ఆశ్రయించింది. ఆ తరువాత సుప్రీం కోర్టులోనూ పిటిషన్ దాఖలు చేసింది. నేషనల్ గ్రీన్ -ట్రైబ్యునల్ గతంలో జారీ చేసిన ఆదేశాల మేరకు కేంద్ర అటవీ, పర్యావరణశాఖతో పాటు- కృష్ణా బోర్డు అధికారులతో కూడిన సంయుక్త కమిటీ- ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. తమ పరిశీలనలో వెల్లడైన విషయాలకు ఇపుడు ప్రాజెక్టు వద్ద తాజా పరిస్థితులను క్రోడీకరించి కృష్ణా బోర్డు అఫిడవిట్ రూపంలో సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించినట్టు- తెలిసింది. రోజుకు 2.07 టీ-ఎంసీల చొప్పున 60 రోజుల్లో 120 టీ-ఎంసీలకు పైగా నీటిని ఎత్తిపోసే సామర్థం ఉన్న పైపులైన్ నిర్మాణ పనులు కూడా చేపట్టినట్టు- గతంలో ఎన్జీటీ-కి సంయుక్త కమిటీ- నివేదిక సమర్పించింది. పర్యావరణ, అటవీ అనుమతుల ఉల్లంఘనలు ఉన్నాయనీ, దీనిపై తెలంగాణ ప్రభుత్వానికి 3.7 కోట్ల జరిమానా విధించాలని కూడా సంయుక్త కమిటీ- -ట్రైబ్యునల్‌కు సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణ పనులను నిలుపుదల చేస్తూ ఎన్జీటీ- ఉత్తర్వులు జారీ చేసింది.

**కృష్ణాలో కేటాయింపులు లేవు..**

తెలంగాణలో నిర్మిస్తున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణానికి అనుమతులు లేకపోగా కృష్ణాలో ఒక్క చుక్క నీటి కేటాయింపులు కూడా లేవని ఏపీ వాదిస్తోంది. కృష్ణా జల వివాదాల -ట్రైబ్యునల్ -1, -ట్రైబ్యునల్-2 ముందు ఎప్పుడూ పాలమూరు-రంగారెడ్డి ప్రస్తావన రాలేదు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని 11వ షెడ్యూల్‌లోనూ ఈ ప్రాజెక్టుకు చోటు- లేదు. కేంద్ర జలశక్తి విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లోనూ పాలమూరు-రంగారెడ్డి అనుమతి లేని ప్రాజెక్టుల జాబితాలో ఉంది.

## మణిపూర్‌లో మరో దారుణం..

### పిల్లల్ని ఎత్తుకొని పారిపోతున్న మహిళను ఈడ్చుకెళ్లి..



మణిపూర్: ఇద్దరు మహిళల్ని నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసిన ఘటన వీడియో బయటపడిన నాటి నుంచి ఒక్కొక్కటిగా మరిన్ని దారుణాలు వెలుగుచూస్తున్నాయి. తాము న్యాయం చేస్తామని అధికారులు ధైర్యం ఇస్తుండడంతో సహాయక శిబిరాల్లో ఉంటున్న మహిళలు ముందుకొచ్చి తమపై జరిగిన అఘాయిత్యాల గురించి నోరు విప్పుతున్నారు. తాజాగా మరో మహిళ వెల్లడించిన తన దీనగాథ కలచివేస్తోంది. అల్లర్లు చెలరేగిన రోజు తనపై సామూహిక అత్యాచారం జరిగిందని, ఆరుగురు వ్యక్తులు తనని కిరాతకంగా కొట్టి మరీ అఘాయిత్యానికి పాల్పడ్డారని సదరు మహిళ తన ఆవేదన వ్యక్తం చేసింది. 37 ఏళ్ల మహిళకు ఈ దారుణ పరిస్థితి ఎదురైంది."మే 3వ తేదీన మణిపూర్‌లో అల్లర్లు చెలరేగినప్పుడు, కొందరు దుండగులు మా ఇంటిని తగలబెట్టేశారు. అప్పుడు నేను నా ఇద్దరు కుమారుల్ని, మేనకోడల్ని వీపుపై ఎత్తుకొని.. వదినతో కలిసి ఇళ్లు వదిలి పారిపోతున్నాం. మా వదిన కూడా తన వీపుపై ఒక బిడ్డను ఎత్తుకుంది. కొంత దూరం పరిగెత్తిన తర్వాత నేను బాగా అలసిపోయి కుప్పకూలిపోయాను. అప్పుడు పిల్లల్ని తీసుకొని వెళ్లిపోమ్మని చెప్పగా.. వదిన వారిని తీసుకొని వెళ్లింది. నేను ఎలాగోలా పైకి లేచి పారిపోతుండగా.. ఐదారుగురు దుండగులు నన్ను పట్టుకున్నారు. వాళ్లు నన్ను దూషించడంతో పాటు నాపై దాడి చేశారు. నేను ప్రతిఘటించగా.. వాళ్లు నన్ను బలంగా కొట్టి, రోడ్డుపై పడేశారు. అనంతరం ఒకరి తర్వాత మరొకరు నాపై అత్యాచారానికి పాల్పడ్డారు" అని ఆ మహిళ తన జీరో ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఆ దుండగులు రాబందుల్లా తనపై ఎగబడటంతో తన ఆరోగ్యం దెబ్బతిందని, మానసికంగానూ కుంగిపోయానని, దాంతో తాను ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నానని బాధిత మహిళ రోధించింది.

### ప్రభుత్వ సమాచారం లీకులపై..

## జగన్ గరంగరం..




అమరావతి, : ప్రభుత్వ సమాచారం లీకులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. కీలక అంశా లపై గోప్యత పాటించాలని సర్వీస్‌రూల్స్ చెబుతున్నా అందుకు విరుద్ధంగా ముఖ్య మంత్రి కార్యాలయంతో సహా కొన్ని ప్రభుత్వ విభాగాల నుంచి ప్రభుత్వానికి సంబంధించిన ఫైళ్ల సమాచారం బయటకు ఎలా పొక్కుతోందనే విషయ మై సీఐడీ ఆరా తీస్తోంది.. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఒకరిద్దరు ఉన్నతాధికారుల మధ్య ఆధిపత్య పోరుతో ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయని కొందరు బ్యూరోక్రాట్లు తమ గాడ్ ఫాదర్‌లను ప్రస న్నం చేసుకుంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గత కొద్ది నెలల క్రితమే ముందుగా ఆంధ్రప్రభ దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైన సంగతి విదితమే. సీఎంఓలో ఆ ఉన్నతా ధికారుల మధ్య ఆధిపత్య పోరు పతాక స్థాయికి చేరుకున్నందునే లీకుల పర్వా నికి దారితీసిందనే ప్రచారం జరుగు తోంది.ముఖ్యమంత్రిగా జగన్ అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి పాలనా వ్యవస్థ లో ఒకింత ప్రక్షాళన చేపట్టినా ఉన్నతాధికారులు.. బ్యూరోక్రాట్ల అనుభవాన్ని ఆదేశాల మేరకు కేంద్ర అటవీ, పర్యావరణశాఖతో పాటు- కృష్ణా బోర్డు అధికారులతో కూడిన సంయుక్త కమిటీ- ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. తమ పరిశీలనలో వెల్లడైన విషయాలకు ఇపుడు ప్రాజెక్టు వద్ద తాజా పరిస్థితులను క్రోడీకరించి కృష్ణా బోర్డు అఫిడవిట్ రూపంలో సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించినట్టు- తెలిసింది. రోజుకు 2.07 టీ-ఎంసీల చొప్పున 60 రోజుల్లో 120 టీ-ఎంసీలకు పైగా నీటిని ఎత్తిపోసే సామర్థం ఉన్న పైపులైన్ నిర్మాణ పనులు కూడా చేపట్టినట్టు- గతంలో ఎన్జీటీ-కి సంయుక్త కమిటీ- నివేదిక సమర్పించింది.




# సామాన్య భక్తులకే నా ప్రాధాన్యత

## టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి





తిరుపతి జిల్లా, తిరుమల, (ప్రజాపాలన న్యూస్): సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం చేయించడానికే ప్రాధాన్యత ఇస్తానని, ధనవంతుల సేవలో తరించేవాడిని కాదని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ధనవంతులు, విఐపిలు దర్శనాల గురించి తాపత్రయపడితే స్వామివారి ఆశీస్సులు లభించవనే వాస్తవం గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడిగా పదవీ ప్రమాణస్వీకారం చేసిన అనంతరం గురువారం ఆయన అన్నమయ్య భవనంలో మీడియాతో మాట్లాడారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారి దయ, ఆశీస్సులతో ఊహించని విధంగా తనకు రెండవ సారి టీటీడీ చైర్మన్ గా పనిచేసే మహద్భాగ్యం దక్కిందన్నారు. ఇంతటి అదృష్టం ఇచ్చిన స్వామివారికి, మరోసారి పనిచేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 2006 నుండి 2008 వరకు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులుగా పని చేసిన సమయంలో ఒక వైపు సనాతన హిందూ ధర్మాన్ని దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేస్తూనే, సామాన్య భక్తులకు అవసరమైన వసతుల కల్పనకు అనేక నిర్ణయాలు తీసుకుని అమలు చేశామన్నారు. మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున నిర్వహించినట్టు చెప్పారు. ఎందరో ధర్మకర్తల మండలి అధ్యక్ష్యులు, కార్యనిర్వహణాధికారులు, కార్యనిర్వాహక అధికారులు, ఉద్యోగుల కృషి, స్వామివారి పట్ల అచంచల భక్తి, విశ్వాసం తో పని చేసినందువల్ల టీటీడీలో మంచి వ్యవస్థ ఏర్పడిందన్నారు. దీన్ని మరింతగా ముందుకు తీసుకుని వెళ్ళి, సనాతన హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తంగా ప్రచారం చేయడంతోపాటు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేలా తమ ధర్మకర్తల మండలి పనిచేస్తుందన్నారు. గతంలో తాను ఛైర్మన్‌గా పనిచేసిన హయాంలో సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేలా ఆచరణలో చేసి చూపామన్నారు. స్వామివారి వైభవాన్ని ప్రజల హృదయాల్లో తీర్చిదిద్దేలా వారిలో ఆధ్యాత్మిక వెలుగులు నింపుతామని చెప్పారు. హోదా, అధికారం, తాము ముఖ్యలమనే భావనతో దేవుడి దగ్గరికి వచ్చేవారిని ఆయన క్షణకాలమైనా చూడకపోతే ఉపయోగం లేదన్నారు. దేశవిదేశాల్లోని హిందువులందరినీ ఏకతాటిపైకి తెచ్చి హిందూ ధర్మాన్ని ప్రచారం చేసేలా టీటీడీ నాయకత్వం వహిస్తుందని చెప్పారు. తాను స్వామివారి సేవకులకు సేవకునిగా పనిచేస్తానని, అధికారం కోసం కాదని అన్నారు. స్వామివారిని భక్తుల దగ్గరికే తీసుకెళ్లి భక్తిప్రసాదం పంచుతామన్నారు.

**దళిత గోవిందం**

గతంలో తాను ఛైర్మన్‌గా పనిచేసిన కాలంలో తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారితో పాటు శ్రీదేవి, భూదేవిని దళితవాడలకు తీసుకుని వెళ్ళి అక్కడే కల్యాణం నిర్వహించి వారికి స్వామివారి ఆశీస్సులు అందజేసే దళిత గోవిందం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.

**శ్రీనివాసకళ్యాణాలు**

భాగవంతున్నే భక్తుల దగ్గరికి తీసుకుని వెళ్ళి ఆశీస్సులు అందించేలా, స్వామివారి కల్యాణాన్ని వారంతా చూసి ఆనందించేలా శ్రీనివాస కళ్యాణాలు పెద్ద ఎత్తున నిర్వహించినట్టు చెప్పారు.

**కళ్యాణమస్తు**

పిల్లల పెళ్ళిళ్ళకు అప్పులు చేసి ఆర్థికంగా చితికి పోతున్న పేద, మధ్య తరగతి వర్గాల వారికి చేయూత నివ్వడానికి కళ్యాణమస్తు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 32 వేలకు పైగా జంటలకు స్వామివారి సమక్షంలో పెళ్ళి చేసి ఆయన ఆశీస్సులు అందింపజేశామని, తద్వారా మత మార్పిడులకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నించామని వివరించారు.

**అందరికీ అన్నప్రసాదం**

2006 కు ముందు తిరుమలలో స్వామివారి దర్శనం చేసుకున్న భక్తులకు మాత్రమే అన్నదానం లో భోజనం చేసే అవకాశం ఉండేదన్నారు. తమ హయాంలో దర్శనంతో సంబంధం లేకుండా కొండ మీదకు వచ్చిన ప్రతి భక్తుడు రెండు పూటల కడుపు నిండా భోజనం చేసే అవకాశం కల్పించామన్నారు.

**నాలుగుమాడ వీధుల్లో పాదరక్షలు నిషేధం**

తిరుమల ఆలయ పవిత్రతను కాపాడటానికి నాలుగుమాడ వీధుల్లో పాదరక్షలతో ప్రవేశాన్ని నిషేధించినట్టు తెలిపారు.

**చంటిబిడ్డ తల్లులకు మహాద్వారం పక్క నుండి ఆలయ ప్రవేశం**

చంటిబిడ్డలతో స్వామివారి దర్శనానికి వచ్చే తల్లులు క్యూ లైన్లలో చాలా ఇబ్బందిపడే వారని, దీన్ని గమనించి చంటిబిడ్డ తో పాటు తల్లికి మహాద్వారం పక్కన కుడివైపు నుండి ప్రత్యేక లైన్ ద్వారా ఆలయంలోకి వెళ్ళేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

**పౌర్ణమి గరుడ సేవ**

బ్రహ్మోత్సవాలలో విశిష్ట మైన స్వామివారి గరుడ సేవను భక్తులు చూసి తరించడానికి ప్రతి పౌర్ణమికి నాలుగు మాడ వీధుల్లో స్వామివారి గరుడ సేవ జరిపేలా నిర్ణయం తీసుకున్నామన్నారు.

**ఎస్వీ బీసీ**

శ్రీ వేంకటేశ్వర స్వామివారి కీర్తిని, సనాతన హిందూ ధర్మాన్ని విశ్వ వ్యాప్తంగా ప్రచారంచేయడం కోసం శ్రీ వేంకటేశ్వర భక్తి చానల్ ఏర్పాటు చేశామని తెలిపారు.

**ఎస్వీ వేద విశ్వవిద్యాలయం**

వేద పరిరక్షణకు టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయించడంలో కీలక పాత్ర పోషించానని, అప్పటి గవర్నర్ శ్రీ రామేశ్వర్ ఠాకూర్‌తో అనేక సార్లు చర్చించి అనుమతులు మంజూరు చేయించామని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సంపూర్ణ సహకారంతో విశ్వ విద్యాలయం ప్రారంభించామన్నారు.

**108 అడుగుల అన్నమయ్య విగ్రహం**

శ్రీ వేంకటేశ్వర స్వామివారిపై 32 వేల సంకీర్త నలు రచించిన శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల 600 జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన జన్మస్థలానికి సమీపంలో ఉన్న రాజంపేటలో 108 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయించామన్నారు. అదేవిధంగా శ్రీవారి ఆలయంలోని శాసనాలను వెలుగులోకి తెచ్చిన శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి విగ్రహాలతోపాటు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టును ప్రారంభించి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు.

**ఎస్సీ, ఎస్టీలకు అర్చక శిక్షణ**

ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లోని ఆలయాల్లో అర్చకులుగా పనిచేస్తున్న వారికి శ్వేత ఆధ్వర్యంలో అర్చక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. మీడియా సమావేశంలో శాసనసభ్యులు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఈవో శ్రీ ఎవి.ధర్మారెడ్డి, శ్రీమతి సదా భార్గవి, శ్రీ వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు అండగా నిలిచిన యుటిఎఫ్:

## యుటిఎఫ్ సీనియర్ నాయ కులు కె.వీరాంజనేయులు



చీరాల, ఆగష్టు 10, ప్రజాపాలన : గత ఐదు దశాబ్దాలు గా, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యా వ్యవస్థ పరిరక్షణకు, నిరంత ర పోరాటం చేస్తూ, అండగా నిలిచిన ఏకైక సంఘం యుటిఎఫ్ అని,యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.వీ రాంజనేయులు అన్నారు. జిల్లా కార్యదర్శి షేక్. జానీ భాషా అధ్యక్షతన జరిగిన యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో, యుటి ఎఫ్ సీనియర్ నాయకులు కె. వీరాంజ నేయు లు, గవిని నాగేశ్వరరావు లు పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయ సమస్యల పై , విద్యావ్యవ స్థ పరిరక్షణకై, నిరంతరం పోరాట పటిమతో, సామాజిక స్పృహ కల్గిన సం ఘం, ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపా ధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) 50 వ ఆవిర్భావదినోత్సవాన్ని, స్థానిక యు.టి.ఎఫ్ చీరాల ప్రాంతీయ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లా డు తూ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, నిరంతరం పోరాడుతున్న యుటిఎఫ్ 50 వసంతాలలో, అనేక సౌకర్యాలు సాధించి పెట్టిందని గుర్తు చేసారు. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను, నేటి ప్రభుత్వ విధానాలతో కాలరాస్తుంటే, ఉపా ధ్యాయులు ఐక్య ఉద్యమాలతో, సాధించుకున్న హక్కులను నిలుపుకోవాలని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్రా రామారావు మాట్లాడుతూ, ప్రభుత్వం జీవో 117వలన,పాఠశాలలు మూత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు భిక్షాలుబాబు మాట్లాడు తూ, సిపిఎస్ రద్దు, జీవో 117 అమలును వ్యతిరేకిస్తూ, ఈ నెల 12వ తేదీన చేపట్టిన ఫ్యాప్టో ఉద్యమాన్ని జయప్రదం చే యాలని కోరారు. జిల్లా కార్యదర్శి జానీ భాషా మాట్లాడు తూ, విద్యాశాఖ లో ఒత్తిడి తీవ్రతరమైందని, ఉపాధ్యా యుల ఆందోళనలను అర్థం చేసుకుని, ప్రభుత్వం తక్షణమే విద్యేతర కార్యక్రమాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. యాప్ ల భారాన్ని తగ్గించాలని, ఉపాధ్యాయులకు జీతాలు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ముందుండే యుటీఎఫ్ పట్ల, ఉపాధ్యాయుల నమ్మకం మరింత చూరగొనేలా కృషి చేస్తామన్నారు. స్వర్గీయ దాచూరి రామి రెడ్డి, అప్పారి వెంకటస్వామి వంటి మహనీయుల ఆశయాల సాధనకు, కంకణ బద్దులవుతామని నినా దాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్ జానీబాషా, జిల్లా ఉపాధ్యక్షులు బి.భిక్షాలుబాబు,ఎయిడెడ్ కన్వీనర్ కుర్రా శ్రీనివాసరావు, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్రా రామారావు, పట్టణశాఖ నాయకులు వెలుగొండారెడ్డి, ఎస్వి.సుబ్బారెడ్డి, ఎన్.రాజేష్, సయ్యద్ జానీ భాషా, బి. పిచ్చయ్య, చీరాల మండలశాఖ నాయకులు ఎం.శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు, కేశవ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణయే సంఘ ధ్యేయం

## పట్టభద్రుల సంఘ అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు



వేటపాలెం, ఆగష్టు 10, ప్రజాపాలన : పేద బడుగు బలహీన వర్గాల విద్యాభివృద్ధియే లక్ష్యంగా, పర్యావరణ పరిరక్షణయే ధ్యేయంగా, సంఘ కృషి చేస్తుందని, పట్టభద్రుల సంఘ అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు స్పష్టం చేశారు. వేటపాలెం మండలం,దేశాయిపేట పంచాయ తీ లోని, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న, షెడ్యూల్ తరగతుల విద్యార్థులకు, పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో పలకలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల సంఘఅధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ, సంఘం యొక్క ప్రధానఆశయం ప్రాథమిక విద్యకు ప్రోత్సాహము అందజేయడం, ఉన్నత విద్యావంతులకు సహకారం అందించడమే లక్ష్యంగా, పర్యావరణ పరిరక్షణయే ధ్యేయంగా, కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అదే పాఠశాలలో చదువుకొని, ఉన్నత విద్యాభ్యాసానికి విదేశాలకు వెళుతున్న,ఆ ప్రాంత మధ్యతరగతి కుటుంబంనుండి వచ్చిన లక్కాకుల ధరణిని అభినందించి, సంఘం తరుపున ధరణికి చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకులు, సంఘ కార్యదర్శి సుంకర వెంకటలక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ, పాఠశాలలో ఇటీవల చేరిన షెడ్యూల్ తరగతుల విద్యార్థులకు, సంఘం తరఫున సహకారం అందజేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన అధ్యాపకురాలు మల్లేశ్వరి మాట్లాడుతూ, ఈ పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసించిన లక్కాకుల ధరణి,ఉన్నత విద్యావంతురాలై విదేశాలలో ఎమ్మెస్ చేయుటకు వెళ్తుండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఉన్నత స్థాయికి ఎదిగి భారతదేశానికి, అదేవిధంగా స్వగ్రామానికి, సేవా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ ఎం.విజయలక్ష్మి, పాఠశాల సిబ్బంది శ్రీహరి, శివ పార్వతి, సభ్యులు చుండూరు మురళీకృష్ణ, మస్తాన్ రెడ్డి కుమార్ తదితర ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# వైసిపి ప్రభుత్వంలో గిరిజనవ్యవస్థలన్నీ నిర్వీర్యం

## తెలుగుదేశంపార్టీ ఎస్టీసెల్ బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీను



పర్చూరు, ఆగష్టు 10, ప్రజాపాలన : వైసిపి ప్రభుత్వంలో గిరిజనవ్యవస్థలన్నీ నిర్వీర్య మయ్యాయని, తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీను అన్నారు. తెలుగుదేశంపార్టీ ఎస్టీసెల్ బాపట్ల పార్లమెంట్ కమిటీ ఆధ్వర్యంలో, వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న గిరిజన ప్రజా వ్యతిరేక విధానాలు, అవలంభిస్తున్న మొండి వైఖరి నశించాలని, గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల కు, ప్రభుత్వానికి కనువిప్పు కలిగించే విధంగా, పర్చూరులో పెద్ద ఎత్తున పోరుబాటతో నిరసన తెలియజేస్తూ, టిడిపి నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి, వినతి పత్రం అందజేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గిరిజనులకు అందాల్సిన నిధులు, ప్రయోజనాలు అందించకుండా, గిరిజన వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేశారన్నారు. గిరిజన కార్పొంషన్ నిధులు, కేంద్రప్రభుత్వం నుంచి వచ్చే ఐటీడిఏ నిధులు ,18 రకాల గిరిజన సంక్షేమ పథకాలను రద్దు చేసి, గిరిజన సబ్ ప్లాన్ నిధులు 5355 కోట్ల రూపాయల దారిమళ్ళింపు చేసి, గిరిజనుల అభి వృద్ధిని విస్మరించారన్నారు. గిరిజన సబ్ ప్లాన్ నిధులు 5355 కోట్ల రూపాయలను దారిమళ్లించటం వలన, గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి శూన్యమైందన్నారు. గిరిజనగూడేలు,తండాల్లో, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదని, వైసిపిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయక పోవటం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. వైసిపి ప్రభుత్వ అసమర్థపాలనలో, గిరిజనులపై దాడులు, అఘాయిత్యాలు రోజురోజుకి పెచ్చరిల్లి పోతున్నాయని, మొన్న ఒంగోలులో మోటా నవీన్ అనే గిరిజన యువకుడిపై దాడి చేయడం అమానుషమని,దీనికి ముఖ్యమంత్రి స్పందించక పోవటం, గిరిజనుల పట్ల చులకనభావం, బాధ్యతారహితంగా వ్యవహరించటం సిగ్గు చేటన్నా రు. గిరిజన గురుకులాలు, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిర్వీర్యం చేయటంతో, గిరిజన బిడ్డల చదువు అటకెక్కిందన్నారు. ప్రశ్నిస్తే గిరిజనుల పట్ల కక్ష్య సాధింపు చర్యలు,అక్రమకేసులు పెట్టి, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశంపార్టీ ప్రభుత్వ హయాం లో, గిరిజనుల అభివృద్ధి ,సంక్షేమం కోసం 14,200 కోట్ల రూపాయలు ఖర్చు చేసి, గిరిజనుల అభివృద్ధికి తోడ్పాటు అందించటం జరిగిందని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు పాలనలో, గిరిజనులకు స్వర్ణయుగంలా వుందని, నేటి వైసిపి ప్రభుత్వ పాలనలో విధ్వంసం, అరాచకం పేట్రేగిపోతున్నాయన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం, ప్రజారాజధాని అమరావతితో పాటు, రాష్ట్రంలోని మూడు ప్రాంతాల అభివృద్ధి కోసం, భావి తరాల యువత భవిష్యత్తు కోసం, అన్ని వర్గాల సంక్షేమం కోసం,నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో,తెలుగుదేశం పార్టీని రాబో యే ఎన్నికలలో, గెలిపించటమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో పర్చూరు మండల పార్టీ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, కార్యదర్శి కొరటాల సురేష్, క్రిష్ణ, మక్కేన శేఖర్, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇండ్ల శ్రీనివాసరావు, పాలపర్తి శ్రీను, అద్దూరి వెంకటేశ్వర్లు, పొన్నర్సు వెంకటేశ్వర్లు, కుంభా ప్రసాద్, ఇండ్ల శ్రీనివాసరావు, యండేటి కోటేశ్వరరావు, పాలపర్తి వీరాస్వామి, రమణమ్మ, ఇటిడిపి కోఆర్డినేటర్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు

శ్రీకాకుళం: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు సీఎం జగన్‌కు బుద్ధి చెబుతారని టీడీపీ ఎంపీ రామ్మోహన్ నాయుడు అన్నారు. ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడారు. "కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే జగన్ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రజల్లో చైతన్యం వచ్చింది. జగన్‌ను భరించే ఓపిక ప్రజలకు లేదు. తిరగపడతాం.. అడ్డొస్తే తొక్కుకుంటూ పోతాం. ఒక్క అవకాశం అని జగన్‌కు అవకాశం ఇచ్చారు. కానీ జగన్ ప్రజలకు నరకం చూపించారు. టీడీపీని చూసి వైసీపీ భయపడుతోంది. భయపడి టీడీపీ అధినేత చంద్రబాబుపై కేసు పెట్టారు. జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి." అని హెచ్చరించారు.

# మన దేశం...,మన మట్టి..అమూల్యమైనది:

## వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కావూరి రమణారెడ్డి



చీరాల, ఆగష్టు 10, ప్రజాపాలన : మన దేశం..,మన మట్టి..,అమూల్యమైనదని, వాటి రుణం ఎప్పటికీ తీర్చుకోలేమని, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కావూరి రమణారెడ్డి స్పష్టం చేశారు. చీరాల మండలం, కావూరివారిపాలెం పంచాయితీలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుక ల్లో భాగంగా,"మన దేశం మన మట్టి" అనే కార్యక్రమంలో భాగంగా,అమృత మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హోం సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల ప్రతినిధులు, ఛైర్మన్ రమణారెడ్డి తదితరులు మాట్లాడుతూ, ప్లాస్టిక్ రహితముగా, రసాయన ఎరు వుల వాడకము తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు. సేంద్రియ ఎరువులు వాడి, భూమిని సారవంతం చేయాలని సూచించారు. దేశం కోసం మిలటరీలో పనిచేసిన కేళ్ళ వెంకట రామారావు, ముడుగు సంజీవరెడ్డి లని ఘనంగా సన్మా నించారు. తర్వాత గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డా.వి శ్రీనివాసరావు, హోమ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.రాధ, ప్రొఫెసర్ సంధ్యారాణి, విజయ్ ప్రసాద్‌రావు, డాక్టర్ హసీనా, చీరాల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కావూరి రమణారెడ్డి, కళాశాలల విద్యార్థులు, పంచాయతీ సెక్రెటరీ, ఆర్.బి.కె అధికారిణి ఏమేలియా, రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి సన్మానం



ఏర్పేడు ప్రజా పాలన న్యూస్. ఏర్పేడు మండలం ,పాతవీరాపురం గ్రామంలో గడప గడప కార్యక్రమంలో గ్రామానికి విచ్చేసిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి గారిని సన్మానించిన పాతవిరాపురం వైసిపి కార్యకర్త జై చంద్ర. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి యువ నాయకుల్ని, యువ కార్యకర్తలను భవిష్యత్తులో అన్ని విధాల ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఆ గ్రామ ప్రజలు కూడా రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని గెలిపించుకుంటామని కూడా హామీ ఇచ్చారు.

## దుప్పి మృతి.. కుక్కల దాడేనా ?..



గోకవరం ఆగస్ట 10 ప్రజాపాలన: కుక్కల దాడిలో దుప్పి మృతి చెందిన సంఘటన గోకవరం మండలం జగన్నాధ పురం గ్రామంలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అటవీ ప్రాంతాల్లో సంచరించాల్సిన దుప్పి మైదాన ప్రాంతాలనీకి రావడంతో కుక్కల దాడిలో దుప్పి మృతి చెందింది. సూది కొండ అటవీ ప్రాంతంలో ఉన్న దుప్పి దారి తప్పి మైదాన ప్రాంతమైన జగన్నాధపురం గ్రామంలోకి రావడంతో కుక్కలు మూకుముడిగా దుప్పిపై దాడి చేయడంతో దుప్పి తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందింది. దుప్పి మృతి చెందిన సంఘటనపై సూది కొండ అటవీ శాఖ సిబ్బంది కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సర్పంచ్ ఎన్నికలకునామినేషన్ దాఖలు



ఏర్పేడు ప్రజా పాలన న్యూస్. ఏర్పేడు మండలం ,పెనుమల్లం గ్రామపంచాయతీలో సర్పంచ్ చనిపోయిన కారణంగా పెనుమలం పంచాయతీకి మళ్లీ సర్పంచ్ ఎన్నికలకునామినేషన్ దాఖలు చేసినారు. సర్పంచ్ అభ్యర్థులు రమణమ్మ మరియు సునీత అనే ఇద్దరు అభ్యర్థులు మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.

## జిల్లాలో భూముల రీ సర్వే రెండో దశ పనులు పనులు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు



మచిలీపట్నం కలెక్టరేట్ : ఆగస్ట్ 10, ప్రజాపాలన : గురువారం మధ్యాహ్నం మంగళగిరి సీసీఎల్ఏ కార్యాలయం నుండి సర్వే సెటిల్మెంట్ భూ రికార్డుల కమిషనర్ సిద్ధార్థ జైన్, అదనపు సీసీఎల్ఏ ఇంతియాజ్ అహ్మద్ జిల్లా కలెక్టర్లతో భూముల రీ సర్వే, అసైన్మెంట్లు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండో దశలో చేపట్టిన భూముల రిసర్వే కార్యక్రమంలో 62 గ్రామాలకు గాను ఇప్పటివరకు 38 గ్రామాల్లో పూర్తయిందని మిగిలిన 24 గ్రామాల్లో ఈ నెలలోగా రీ సర్వే పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రీ సర్వే 24 గ్రామాలకు సంబంధించి సెక్షన్ 13 నోటిఫికేషన్లు కూడా ఈ నెలాఖరులోగా జారీ చేస్తామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 20 గ్రామాల్లో సరిహద్దు రాళ్లు నాటారని, మిగిలిన 42 గ్రామాల్లో వచ్చే సెప్టెంబర్ మాసం లోగా పూర్తి చేస్తామన్నారు.. అసైన్మెంట్ భూములకు సంబంధించి జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులతో చర్చిస్తామని, రెండు రోజుల్లో తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారుఅలాగే లంక భూములకు సంబంధించి కూడా వెంటనే తగిన చర్యలు తీసుకొని అసైన్మెంట్ పూర్తి చేస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుంచి డిఆర్ఓ. ఎం. వెంకటేశ్వర్లు సర్వే భూ రికార్డుల ఏడి గండికోట రంగారావు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి..: జిల్లా కలెక్టర్



మచిలీపట్నం కలెక్టరేట్ : ఆగస్ట్ 10, ప్రజాపాలన : పిల్లల ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే నులిపురుగుల నివారణకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవమును పురస్కరించుకొని చిలకలపూడి పాండురంగ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగులు సోకిన పిల్లలు, కిశోర బాలలు వివిధ ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారని, వాటిలో ప్రధానంగా రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడుతుందని, ఫలితంగా నీరసంతో పాటు శారీరక, మానసిక ఎదుగుదల లోపిస్తుందని అన్నారు. ఈ విధమైన సమస్యలను అధిగమించడానికి పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వారిచేత మింగించాలని అధికారులకు సూచించారు. దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పర్యవేక్షించాలన్నారు. ఒకటి నుంచి ఐదు ఏళ్ల పిల్లలకు అంగన్వాడి కేంద్రాలు, ఆరు నుంచి 19 ఏళ్ల కిశోర బాలలకు పాఠశాలలు, కళాశాలలో మాత్రలు తప్పనిసరిగా పంపిణీ చేయాలని అధికారులకు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లలు, గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, రక్తహీనత నివారణకు తరచుగా పరీక్షలు నిర్వహిస్తూ ఐరన్ మాత్రలతో పాటు పోషకాహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జీ. గీతాబాయి, జిల్లా విద్యాశాఖ అధికారిణి తాహెర సుల్తానా, ఉప విద్యాశాఖ అధికారి సుబ్బారావు, 9వ డివిజన్ కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ, ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణా దినోత్సవం



గోకవరం ఆగస్ట్ 10 ప్రజాపాలన: మండల కేంద్రమైన గోకవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణా దినోత్సవం గురువారం గోకవరం లో జరుపబడినది. ఎమ్.ఈ.ఓ. గౌరమ్మ సమక్షంలో డా.నిఖిత ఎంపీడీవో కె.పద్మజ్యోతి ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, ఈ.ఓ.పి.ఆర్.డి. రాజేశ్వర్రావు ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు అల్బెన్డజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ కార్యక్రమము ను అన్ని ప్రయివేటు, పబ్లిక్ కళాశాలలు,స్కూల్స్,అంగన్వాడీ సెంటర్లలో అమలుచేయడం చాలా ఆనందకరమని పిల్లలు ఆరోగ్యం గా ఉండాలంటే ప్రతీ 6నెలలకు ఈ మాత్రలు వేసుకోవాలని అన్నారు. జి.కొత్తపల్లి సి.హెచ్.ఓ. మేరీ కృప,ఎమ్.పి.హెచ్.ఈ. ఓ.వై.యెస్.రాయుడు,హెచ్.ఈశైలజ,హెచ్.వి.సుజాత మండలంలోని అన్ని స్కూల్స్ ఈరోజు ఈ కార్యక్రమం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెడ్ మాస్టర్ సత్యన్నారాయణరెడ్డి,ఎమ్.ఎల్.హెచ్.పి.అనూష, హెల్త్ అసిస్టెంట్స్ పవన్,రమణ,ఏ.ఎన్.ఎమ్.నాగలక్ష్మి ఆశాలు పాల్గొన్నారు.

## తల్లి ప్రేమ, నేల తల్లి విలువలను వెలకట్టలేం...

**మాజీ సర్పంచ్, సచివాలయ కన్వీనర్ జంగిలి వెంకట రామారావు**



వేటపాలెం, ఆగష్టు 10, ప్రజాపాలన : నవ మాసాలు మోసి జన్మనిచ్చే తల్లి ప్రేమ, బ్రతికినంత కాలం మోసే నేలతల్లి ప్రేమను వెలకట్ట లేమని, అక్కాయి పాలెం మాజీ సర్పంచ్, సచివా లయ కన్వీనర్ జంగిలి వెంకట రామారావు అన్నారు. వేటపాలెం మండలం, అక్కాయిపాలెం గ్రామ సచివాలయం వద్ద, మండలస్పెషల్ ఆఫీసర్ రాజా దిబోరా పర్యవేక్షణలో, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా,అత్యంత దేశభక్తి తో నా దేశం-నా భూమి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రామారావు మాట్లాడుతూ, సారవంతమైన నేల ఉండేలా సేంద్రియ ఎరువులను వాడాలని, భావితరాలకు దేశభక్తి ఉండేలా స్ఫూర్తి నివ్వాలని పిలుపునిచ్చారు. ఆర్మీ ఉద్యోగిగా దేశానికి సేవ లందించిన చుండూరు వెంకటేష్ బాబు ను ఘనంగా సన్మానించి, తమ దేశభక్తిని చాటుకున్నారు. తొలుత నా దేశం-నా భూమి శిలాఫలకా న్ని ఆవిష్కరించి, మొక్కలు నాటారు. చీరాల ఎమ్మెల్యే బలరామ్ ఆదేశానుసారం, వైసిపి చీరాల ఇంచార్జ్ కరణం వెంకటేష్ సూచనల మేరకు కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అక్కాయిపాలెం మాజీసర్పంచ్, సచివాలయ కన్వీనర్ జంగిలి వెంకట రామారావు తో పాటు, మండ ల స్పెషలాఫీసర్ రాజా దిబోరా, పంచాయతీ సెక్రెటరీ పూర్ణిమ, విజయ్ బాబు, వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, అంగ న్వాడి సిబ్బంది, ఆయా శాఖల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నా రు.

## సెయింట్ ఆన్స్ కాలేజ్ లో ర్యాగింగ్ యాక్ట్ -1997 పై అవగాహనా సదస్సు




చీరాల, ఆగష్టు 10, ప్రజాపాలన : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజిలో, ఎ.పి. ప్రొహిబిషన్ ఆఫ్ రాగింగ్ యాక్ట్ 1997 పై, మండ ల న్యాయ సేవాధికార సంస్థ సహకారంతో, కళాశాల యన్.యస్.యస్.వారి ఆధ్వర్యంలో, విద్యార్థులకు అవగాహనా సద స్సును నిర్వహించినట్లు, కళాశాల కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, కళాశాల ప్రధానోధ్యాపకులు డాక్టర్ మొయిద వేణుగోపాలరావు లు సంయుక్తంగా తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిధిగా హాజరైన సీని యర్ సివిల్ జడ్జి యం.సుధ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి హక్కులు, భా ధ్యతలు ఉంటాయని, తమ ప్రవర్తన ద్వారా ఎదుటివారి హక్కులకు, భంగం కలిగించరాదని, అలా చేస్తే అది నేరమవుతుందని వివరించారు. విద్యార్థులు, సెల్ ఫోన్, ఇంటర్నెట్ వంటి వాటిని, అవసరమైన వాటికి మాత్రమే వా డుకొని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలు పు నిచ్చారు. విద్యార్థులు ర్యాగింగ్ దుష్పరిణామాలను తెలిసికొని, దాని జోలికి పోకూడదని హిత వు పలికారు. న్యాయ వాదులు విద్యార్థులకు ఎ.పి. ప్రొహిబిష న్ ఆఫ్ రాగింగ్ యాక్ట్ 1997 పై అవగాహన కల్పించారు. తెలిసి చేసినా, తెలియక చేసినా ర్యా గింగ్ ఒక నేరమని,దానికి ఎ.పి. ప్రొహిబిషన్ ఆఫ్ రాగింగ్ యాక్ట్ 1997 శిక్షలుంటాయని హెచ్చరించారు. విద్యాసంస్థలలో గాని, బయట గాని, సీనియర్ విద్యా ర్థులు, జూనియర్ విద్యార్థుల ను ర్యాగింగ్ చేయరాదన్నారు. విద్యాసంస్థలలో స్నేహ పూరిత వాతావరణంలో, విద్యను సముపార్జించాలని కోరారు. యూనివర్సిటీ గ్రాంట్ కమీషన్ వారి రెగ్యులేషన్స్ ప్రకారం, ప్రతి విద్యాసంస్థలో ర్యాగింగ్ నిరోధక చర్యలను చేపట్టి, యాంటీ ర్యాగింగ్ కమిటీ లను ఏర్పరిచి, ర్యాగింగ్ ని నిర్మూలించాలన్నా రు. మార్పు అనేది అందరూ పాటిస్తేనే వస్తుందని, విద్యార్థు లందరూ కలిసి ర్యాగింగ్ ను తరి మి కొట్టాలన్నారు. యన్. యస్.యస్.కోఆర్డినేటర్ దివి శాంతి స్వరూప్ కన్వీనర్ గా, వ్యవహరించిన ఈ కార్యక్రమం లో, న్యాయ వాదులు జి.రమేష్ బాబు, ఎ.సతీష్ రెడ్డి, సైక్రియా ట్రిస్ట్ పి.అన్వేష్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొ న్నారు.

## రాక్షస పాలన నుండి విముక్తి చెయ్యగల శక్తి మహిళలకు మాత్రమే ఉంది: జ్యోతుల నెహ్రూ



గోకవరం ఆగష్టు 10. ప్రజా పాలన: రాష్ట్రాన్ని రాక్షస పాలన నుండి విముక్తి చెయ్యగల శక్తి మహిళలకు మాత్రమే ఉందని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం మండలం గుమ్మల్ల దొడ్డి గ్రామంలో మహాశక్తి మహిళల ఆధ్వర్యంలో మహాశక్తి ప్రచార రథయాత్ర కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగాపాల్గొని ఇంటి ఇంటికి తిరుగుతూ మహాశక్తి కార్యక్రమ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూమాట్లాడుతూ రాష్ట్ర ప్రజల బ్రతుకులు చిందరవందర అయిపోయాయని, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం పెంచిన నిత్యవసరవస్తువు ల ధరలు, కరెంటు బిల్లులు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు, ఇంటి పన్ను చెత్త పన్ను మరుగు దొడ్డి పన్ను వంటి వాటి వల్ల అన్నీ వర్గాల ప్రజలు సర్వనాశనం అయిపోయారని, కూలి పని చేసుకునే శ్రామికుడు నుండి పై స్థాయి వ్యాపారస్తుల వరకు అగమ్యగోచరంగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర జనాభాలో సగం మంది ఉన్న మహిళలు రాష్ట్ర ప్రగతి కోసం, రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం ఈ దుర్మార్గపు వైస్సార్సీపీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలియజేసి రేపు రాబోయే రోజుల్లో ప్రజలందరి సమన్వయంతో చంద్రబాబు నాయుడు ను ముఖ్యమంత్రి గా చేసుకోవాలని నెహ్రూ అన్నారు. మహాశక్తి కార్యక్రమానికి మహిళల నుండి విశేష స్పందన లభిస్తుందని, చంద్రబాబు నాయుడు ని ముఖ్యమంత్రి గా మరల గెలిపిస్తామని ప్రతీ మహిళ స్పందిస్తుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం కోసం ప్రజలందరూ ఎదురు చూస్తున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ మేనిఫెస్టో వల్ల అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ముఖ్యంగా ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ ఉచితం, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి వాటి వల్ల మహిళలకు మంచి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఈది రత్నజ్యోతి కోట సత్యవతి, నకిరెడ్డి సూర్యవతి, గుమ్మల్లఅనంతలక్ష్మి, పోలినాటి ధర్మానందకుమారి, రాపాక లక్ష్మి, యల్లాటి అమ్మాజీ, గెద్దాడ సత్యవేణి, గొల్లపల్లి శ్రీదేవి, చెక్క మరియా, గుండుపల్లి సుజాత, తిప్పన సత్యవతి, గొల్లవిల్లి వరలక్ష్మీ, ఏగి సంతోష కుమారి, ఏగి వరలక్ష్మి, ఆడారి ఆదిలక్ష్మి, ఆడారి విజయ, దమ్ము సింహాచలం, ఇండిగమిల్లి వెంకటలక్ష్మి అధిక సంఖ్యలో మహిళా కార్యకర్తలు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
శుక్రవారం 11, ఆగష్టు 2023

# నిధులు లేక గ్రామాల్లో నిలిచిన అభివృద్ధి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పంచాయతీ వ్యవస్థను ధ్వంసం చేసింది. పంచాయతీల సమస్యలు, అభివృద్ధికి ఉద్దేశించిన నిధులను ఇవ్వక ఇబ్బందులు పెడుతోంది. కేంద్రం ఇచ్చిన నిధుల్ని కూడా తీసేసుకోవడంతో గ్రామాల్లో రోడ్లు నిర్మించుకోలేక, తాగునీటి, పారిశుధ్య, వీధిలైట్ల సమస్యలు పరిష్కరించుకోలేక పంచాయతీలు అచేతనమయ్యాయి. ఇది చాలదన్నట్లు పంచాయతీలకు సమాంతర వ్యవస్థగా గ్రామ సచివాలయం, వ్యక్తులుగా వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లను తీసుకురావడంతో సర్పంచ్‌ల గౌరవ మర్యాదలకు భంగం కలిగింది. మొత్తంగా చూస్తే వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలుచేయక, గ్రామాలను నిర్లక్ష్యం చేస్తోంది. నిధులు, హక్కులు, అధికారాలు లేక సర్పంచ్‌లు నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులివ్వదు. కేంద్రమిచ్చే నిధులు చెప్పకుండా లాగేసుకుంటోంది. పన్నుల రూపంలో వచ్చే నిధుల్ని కరెంటు బిల్లుల పేరిట జమ చేసుకుంటోంది. అంటే 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం పంచాయతీలకు అధికారాలు దఖలుపరచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. పంచాయతీల్లో పాలకవర్గం ఉన్నా ఎమ్మెల్యేల పెత్తనమే కొనసాగుతోంది. సచివాలయ వ్యవస్థ పంచాయతీలో భాగమేనని ప్రభుత్వం మొదట ప్రకటించినా... 2021 ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికల అనంతరం వాటిపై సర్పంచ్‌ల పర్యవేక్షణ, ఉద్యోగులకు సెలవు మంజూరు అధికారాన్ని తీసేసింది. గ్రామ, వార్డు సచివాలయాల శాఖను సృష్టించి అజమాయిషీ చేస్తోంది. దీంతో సచివాలయ ఉద్యోగులు సర్పంచ్‌లను లెక్క చేయడం లేదు. గ్రామాల్లో సంక్షేమ కార్యక్రమాల అమలు, లబ్ధిదారుల ఎంపిక సర్పంచ్‌లకు తెలియకుండానే జరిగిపోతున్నాయి. గ్రామాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న వలంటీర్ల పైనా సచివాలయం పెత్తనమే ఉంటోంది.రాష్ట్రంలో 13,344 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో 70 శాతం చిన్న పంచాయతీలే. వీటిలో పన్నులు పెద్దగా వసూలు కావు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు, కేంద్రం ఇచ్చే నిధులతోనే గ్రామాల్లో పనులు చేస్తారు. ఇప్పుడు అవి ఆగిపోవడంతో అభివృద్ధి పనులు చేయలేకపోతున్నారు. పారిశుధ్య కార్మికులకు వేతనాలు, తాగునీటి ఖర్చు, విద్యుత్ బిల్లులు ఇవన్నీ పంచాయతీలకు వచ్చే అరకొర ఆదాయం నుంచే చెల్లించాల్సి వస్తోంది. ఉపాధి హామీ పథకాల నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాటాతో కలిపి గ్రామాల్లో చాలా రకాల పనులు చేపట్టవచ్చు. కాని అవేమీ జరగడం లేదు. ఆర్థిక సంఘం ఇచ్చే నిధులను గ్రామాల్లో స్వేచ్ఛగా ఖర్చుచేసుకునే అవకాశం ఇవ్వడం లేదు.గ్రామాల అభివృద్ధిలో కేంద్ర ఆర్థిక సంఘం నిధులు కీలకం. పంచాయతీల తీర్మానంతో వినియోగించాల్సిన ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇష్టారీతిన మళ్లిస్తోంది. వాస్తవానికి కేంద్ర నిధుల వినియోగం కోసం జాతీయ బ్యాంకులలో సర్పంచ్‌ల పేరిట పిఎంఎఫ్ఎస్ ఖాతాలు తెరిచారు. డబ్బులు ఆ ఖాతాల్లో వేయాలి. కాని రాష్ట్ర ప్రభుత్వం సిఎంఎఫ్ఎస్ లేదా పీడీ ఖాతాల్లో జమచేసుకుంటోంది. సర్పంచ్‌లకు కనీస సమాచారం ఇవ్వకుండా నిధులను తమ అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం వాడుకుంటోంది. 2018%--%19లో రూ.1729.23 కోట్లు, 2019%--%20లో రూ.2,336.56 కోట్లు, 2020%--%21లో రూ.2,625 కోట్లు, 2021%--%22లో రూ.1,939 కోట్లు మొత్తం కలిపి రూ.8,629 కోట్ల కేంద్ర ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి తన ఖాతాల్లో వేసుకుందని సర్పంచ్‌ల సంఘం ఆరోపిస్తోంది. 2022%--%23సంవత్సరానికి రూ.2,010 కోట్లు, 2023%--%24 ఏడాదికి రూ.2,031 కోట్లు కేంద్రం విడుదల చేస్తుంది. సర్పంచ్‌లు తమ నిధుల కోసం ఆందోళన చేస్తుంటే కొన్ని నిధులు పంచాయతీల ఖాతాల్లో వేసినా, వాటిపై పలు ఆంక్షలు విధిస్తున్నారు. వచ్చిన నిధులను విద్యుత్ బిల్లుల పేరిట రాష్ట్ర ప్రభుత్వం తిరిగి రాబట్టుకుంటోంది. పంచాయతీల నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే గత రెండేళ్లలో దాదాపు రూ.1,245 కోట్లను విద్యుత్తు బకాయిల కింద పంపిణీ సంస్థలకు ఇచ్చేసింది. ఇవికాక గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించే గ్రీన్ అంబాసిడర్ల జీతాలను ఆ నిధుల నుంచి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశిస్తోంది. వాస్తవానికి గ్రీన్ అంబాసిడర్ల జీతాలు క్లీన్ ఏపీ కింద చెల్లించాలి. కాని ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు బలవంతంగా ఖర్చు చేయిస్తోంది. గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులు గతంలో రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పంచాయతీ నిధులు ఖర్చుచేస్తున్నారు. ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల ఖాతాలకు నేరుగా జమ చేయాలని సర్పంచ్‌లు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా వారిని విచక్షణారహితంగా రోడ్లపై ఈడ్చుకెళ్లి అరెస్టు చేశారు.ఈ ఏడాది మార్చి నెలాఖరులోగా 2022-23 సంవత్సరానికి సంబంధించి రెండు విడతలుగా విడుదల చేయాల్సిన రూ.2,010 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం మొన్నటివరకు పక్కన పెట్టింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకమే కారణం. ఆర్థిక సంఘం నిధులను నేరుగా బదిలీ చేస్తామంటూ పంచాయతీలతో బ్యాంకు ఖాతాలు తెరిపించినా నిధులు జమ చేయలేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం ఏర్పాటులోనూ తీవ్ర జాప్యం చేసింది. ఈ తీరుపై కేంద్రం తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చింది. దీంతో పంచాయతీల బ్యాంకు ఖాతాలకే నిధులు జమ చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి హామీ ఇచ్చాకే తొలి విడత కింద రూ.988 కోట్లు విడుదల చేసింది.ఓవైపు ఆర్థిక సంఘం నిధులు కేటాయించకపోవడం.. మరోవైపు ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ నిధులతో చేపట్టే పనులకు అనుమతులివ్వకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోయింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో గ్రామాల్లో దాదాపు రూ.9 వేల కోట్లతో 35 వేలకు పైగా సచివాలయాలు, రైతు భరోసా, ఆరోగ్య కేంద్రాలకు భవనాల నిర్మాణం మొదలుపెట్టింది. వీటిలో చాలావరకు పూర్తి కాలేదు. వాస్తవానికి తన భాగస్వామ్య నిధులతో వీటిని ప్రభుత్వం నిర్మించాలి. కాని ప్రచారం మాత్రం తమది, నిధులు కేంద్రానివి అన్నట్లు ఆర్థిక సంఘం నిధులను వీటి కోసం వినియోగిస్తూ, గ్రామీణ అవసరాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కొందరు వైసీపీకి చెందిన సర్పంచ్‌లు వీటి నిర్మాణానికి తమ సొంత డబ్బు ఖర్చుచేసినా, ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదంటున్నారు. పనులేవీ కాకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కొరవడుతోంది. ఏడాది వ్యవధిలో పంచాయతీల సాధారణ నిధుల నుంచి రూ.25 కోట్లకు పైగా ప్రభుత్వం వసూలు చేసింది. ఫలితంగా కనీసం మురుగు కాలువ కూడా ఏర్పాటుచేయలేని దయనీయ స్థితిలో సర్పంచ్‌లున్నారు. ఇప్పటికే కేంద్ర మంత్రులను కలసి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై వారు వివరించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని సర్పంచ్‌ల సంఘం కలిసి, రాష్ట్ర ప్రభుత్వం వల్ల తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, తమకు మద్దతు ఇవ్వాలని కోరింది. ఆమె వారికి మద్దతును ఇస్తూ, కేంద్ర నిధుల మళ్లింపుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ, బీజేపీ శ్రేణులు నేడు రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేయాలని పిలుపు ఇచ్చారు.

# చైనాపై అమెరికా సరికొత్త ప్రచార దాడి!



గతంలో సోవియట్ యూనియన్ ఉన్నపుడు దానితో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవు. కమ్యూనిజం విస్తరణను అడ్డుకొనే పేరుతో ప్రచ్ఛన్న యుద్ధం పేరుతో సాగించిన ప్రత్యక్ష ప్రచార దాడిలో భాగంగా సోషలిజం, కమ్యూనిజం వ్యతిరేకతను రెచ్చగొట్టారు. సోషలిజమే మెరుగైనది, పెట్టుబడిదారీ విధానం విఫలమైంది అనే భావన రోజురోజుకీ బలపడుతోంది. అందువలన పాతబడిన కమ్యూనిస్టు వ్యతిరేక అస్త్రాన్ని ప్రధానంగా ప్రయోగించాలని అమెరికా ప్రయత్నిస్తున్నది. పెట్టుబడిదారీ విధానాన్నే అస్త్రంగా మార్చి అమెరికాను దెబ్బ తీసేందుకు చైనా ఎలా ప్రయత్నిస్తున్నదో చూడండి, మన పెట్టుబడులనే మన నాశనానికి వాడుతున్నది-అంటూ అమెరికాలో విశ్లేషకులు కొందరు అక్కడి పాలక వర్గాన్ని హెచ్చరించారు. ఇది ఒకరిద్దరి అభిప్రాయం అనుకుంటే పొరపాటు. అమెరికాలో పెట్టుబడిదారీ విధానం మీద తలెత్తిన ఆగ్రహాన్ని పక్కదారి పట్టించేందుకు అక్కడి పాలకవర్గ మేధావులు ముందుకు తెచ్చిన సరికొత్త ప్రచారదాడిలో అదొక అస్త్రం. అదే విధంగా అమెరికా స్కూళ్లలో చైనా ప్రవేశించి కమ్యూనిస్టు పాఠాలు చెబుతున్నదని ఆధారంలేని ఆరోపణలతో ఒక నివేదికను విడుదల చేశారు. ఈ రెండూ అక్కడి పాలకవర్గంలో ఉన్న చైనా వ్యతిరేకత, కమ్యూనిస్టు వ్యతిరేకతను జనం మెదళ్లలోకి ఎక్కించే ప్రయత్నం కనిపిస్తున్నది. విశ్లేషకుల కథన సారం ఇలా ఉంది. "ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి కమ్యూనిస్టు సిద్ధాంత మార్గదర్శకత్వంలో పని చేసే చైనా నుంచి ముప్పు తీవ్రం అవుతున్నది. అందువలన దానితో ఆర్థిక లావాదేవీలను పున: విశ్లేషణ చేసుకోవాల్సిన అత్యవసరం ఎప్పటి కంటే మరింత పెరిగింది. అమెరికా పెట్టుబడులతో అపార సంపదను చైనా పోగేసుకుంది. మన స్వంత పెట్టుబడిదారీ వ్యవస్థను మన వ్యతిరేక ఆయుధంగా మార్చింది. పెన్షన్ నిధులు, ఇతర మార్గాల ద్వారా దాదాపు పది కోట్ల మంది అమెరికన్లు తమకు తెలియకుండానే తమను దెబ్బతీసే ఆర్థిక ప్రత్యర్థి చైనాలో పెట్టుబడులు పెట్టారు. ప్రపంచాధిపత్యం కోసం చూస్తున్న దాని మిలిటరీ బలపడేందుకు అవకాశం కల్పించారు. ఆర్థిక సరళీకరణను ప్రారంభించిన 1978 నుంచి చైనా ఒక పద్దతి ప్రకారం పశ్చిమ దేశాల పెట్టుబడి మార్కెట్లను లక్ష్యంగా చేసుకుంది. చైనా కమ్యూనిస్టు పార్టీపై అమెరికా పార్లమెంటు ఏర్పాటు చేసిన సెలెక్ట్ కమిటీ ముందు సాక్ష్యమిచ్చిన పెట్టుబడి మార్కెట్ల భద్రతా కమిషనర్ రోజర్ రాబిన్సన్ మాట్లాడుతూ "పరాకుగా ఉన్న అమెరికా చైనా కమ్యూనిస్టు పార్టీ నియంత్రణలో ఉన్న ఐదు వేల కంపెనీల్లో లక్షల కోట్ల డాలర్లను పెట్టుబడులుగా పెట్టేందుకు సాధారణ అమెరికన్లను అనుమతించింది. ప్రపంచమంతటి నుంచి చైనా వచ్చే పెట్టుబడుల్లో అరవైశాతం డాలర్లు అమెరికా వనరుల నుంచే ఉన్నాయి గనుక అవి నిలిచిపోతే అక్కడి ఆర్థికరంగం పూర్తిగా దెబ్బతిని చైనా ప్రభుత్వానికి ముప్పు ఏర్పడుతుంది. పెట్టుబడులు పెట్టినందుకు దోహదం చేసిన బ్లాక్‌రాక్ వంటి అగ్రశ్రేణి ఆస్తుల నిర్వహణ సంస్థలు ఇప్పుడు సాకులు చెబుతున్నాయి.అమెరికా పర్యావరణ, సామాజిక, పాలన ప్రమాణాలను పక్కన పెట్టి పెట్టుబడులు పెట్టాయి. ఇలాంటి కంపెనీలు వాటిని గట్టిగా పాటించి ఉంటే చైనా కంపెనీలకు పెట్టుబడులు వెళ్లేవి కాదు. ప్రపంచంలోని ఏ దేశంలోనూ పెట్టనన్ని పెట్టుబడులను బ్లాక్‌రాక్ కంపెనీ సిఇఓ లారీ ఫింక్ ప్రవహింపచేశాడు. పెట్టుబడి సంస్థలు చైనాలో పెట్టుబడులు పెడితే సంభవించే ఆపదల గురించి పట్టించుకోకపోగా పైకి కనిపించినంత చెడ్డగా చైనా సంస్థలు లేవని యుబిఎస్ గ్లోబల్ వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ వంటివి చెప్పాయి. చైనా మీద ఆధారపడితే తలెత్తే ముప్పును తొలగించుకొనేందుకు, నూతన సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు జి7 దేశాల కూటమి పూనుకుంది. అంతేకాదు అమెరికా స్టాక్ ఎక్స్చేంజ్‌లలో ఉన్న చైనా కంపెనీలను జాబితా నుంచి తొలగించాలి, రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి.చైనా కంపెనీలకు రుణాలు ఇచ్చే సంస్థలను నిషేధించాలి" అని అన్నారు. డాలర్ల రూపంలో ఇస్తున్న చైనా ప్రభుత్వ బాండ్ల మీద నిషేధం విధించాలి. గతంలో సోవియట్ ముప్పును వమ్ము చేసేందుకు అనుసరించిన ఆర్థిక పద్దతులను ఇప్పుడు చైనా మీద ప్రయోగించాలి. మనం దీర్ఘకాలంగా ప్రేక్షకుల మాదిరి ఉన్నాం, మన పెట్టుబడిదారీ వ్యవస్థను నియంత్రించేందుకు ఇది సరైన తరుణం. " అమెరికా గడ్డ మీద, వెలుపలా చైనా నిరంతర నిఘాను ఉపేక్షించరాదని ఆగస్టు మొదటి వారంలో జరిగిన పార్లమెంటు సెలెక్ట్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన రిపబ్లికన్ పార్టీ ఎంపీ మైక్ గాలఘర్ డిమాండ్ చేశాడు. ఇప్పుడే మేల్కొన్నామని కూడా అన్నాడు. దానిలో భాగంగా ప్రపంచమంతటా రహస్య పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసిందని ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే.చైనాలో ప్రైవేటు కంపెనీలంటూ లేవు, ప్రతి ఒక్కరూ, ప్రతిదీ, ప్రతి సంస్థ సీ జిన్‌పింగ్ కోరుకున్నదాని ప్రకారమే ఉంటుందని గాలఘర్ ఆరోపించాడు.చైనాలో పెట్టుబడులపై పరిమితులను మరింతగా విస్తరించాలని జో బైడెన్‌ను గాలఘర్ కోరాడు. ఉత్తరువుల ద్వారా వాటిని వెంటనే అమల్లోకి తేవాలంటూ ఒక లేఖను కూడా రాశాడు. ప్రభుత్వ పెట్టుబడులకే పరిమితం గాకుండా ప్రైవేటు పెట్టుబడుల మీద ఆంక్షలు విధించాలని కోరాడు. చైనా మిలిటరీ కంపెనీలకు మన పెట్టుబడులు తరలటం అంటే మన నాశనానికి మనమే సహకరించినట్లు అవుతుందన్నాడు. చైనా బాండ్లు, కంపెనీల వాటాల్లో 1.1లక్షల కోట్ల డాలర్లు, ప్రైవేటు పెట్టుబడిదారులు 20 వేలకోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టినట్లు పేర్కొన్నారు. దీనిలో ఎక్కువ భాగం చైనా మిలిటరీతో సంబంధాలున్న కంపెనీలలో ఉందని ఆరోపించాడు. చైనాతో ఘర్షణకు దిగాల్సి వస్తే మనం భూవ్యూకాశాలను కదిలించాల్సి ఉంటుందని,ఎంతో వినాశకరంగా ఉంటుందని అన్నాడు.అమెరికా నిషేధిత జాబితాలో ఉంచిన చైనా కంపెనీల్లో పెట్టుబడులు ఎందుకు పెట్టారంటూ బ్లాక్‌రాక్, ఎంఎస్‌సిఐ కంపెనీలకు సెలెక్ట్ కమిటీ అడిగిన సంజాయిషీకి తాము చట్ట ప్రకారమే తమ వాణిజ్య పద్దతుల్లో భాగంగానే పెట్టుబడులు పెట్టినట్లు ఆ కంపెనీలు చెప్పాయి. ఇలా సాగిన విశ్లేషణలు, పార్లమెంటరీ కమిటీ చైనా మీద చేసిన విచారణ అంతా అమెరికా ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలకు, రాజకీయంగా ప్రపంచంలో తింటున్న ఎదురుదెబ్బలకు కారణం చైనా అని తమ జనాన్ని నమ్మించేయత్నం తప్ప మరొకటి కాదు. గతంలో సోవియట్ యూనియన్ ఉన్నపుడు దానితో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవు. కమ్యూనిజం విస్తరణను అడ్డుకొనే పేరుతో ప్రచ్ఛన్న యుద్ధం పేరుతో సాగించిన ప్రత్యక్ష ప్రచార దాడిలో భాగంగా సోషలిజం, కమ్యూనిజం వ్యతిరేకతను రెచ్చగొట్టారు. సోషలిజమే మెరుగైనది, పెట్టుబడిదారీ విధానం విఫలమైంది అనే భావన రోజురోజుకీ బలపడుతోంది. అందువలన పాతబడిన కమ్యూనిస్టు వ్యతిరేక అస్త్రాన్ని ప్రధానంగా ప్రయోగించాలని అమెరికా ప్రయత్నిస్తున్నది. అమెరికా స్కూళ్లలో పెద్ద ఎత్తున ప్రవేశిస్తున్న చైనా వాటిని కమ్యూనిస్టు ప్రచారానికి అడ్డాలుగా మారుస్తున్నదని విద్యా పరిరక్షక తలిదండ్రుల కమిటీ(పిడిఇ) పేరుతో ఉన్న సంస్థ తాజాగా ఒక నివేదికలో ఆరోపించింది. అమెరికాలో స్కూళ్లు పన్నెండవ తరగతి(మన దగ్గర ఇంటర్ మీడియెట్) వరకు బోధిస్తాయి. తమ దేశ తత్వవేత్త కన్ఫ్యూసియస్ పేరుతో వందకు పైగా కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో తరగతులను నిర్వహించేందుకు అమెరికా ప్రభుత్వ అనుమతుల మేరకే చైనా ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నది. అయితే అమెరికా సాంకేతిక పరిజ్ఞానాన్ని తస్కరించేందుకు, తమకు ఏజంట్లుగా పనిచేసే వారిని ఎంచుకొనే కేంద్రాలుగా మార్చుతున్నదంటూ ఆరోపిస్తూ ఇటీవల అమెరికా ఎఫ్‌బిఐ ఒక నివేదికను వెల్లడించింది. చైనా జాతీయ ఇంటెలిజెన్స్ చట్టంలో చైనా పౌరులు ఎక్కడ నివశిస్తున్నప్పటికీ తమ మాతృభూమి కోసం కళ్లు, చెవులుగా పని చేయాలని చెప్పిందని, అందువలన అమెరికాతో సహా విదేశాల్లో ఉన్న చైనా జాతీయులందరూ గూఢచర్యానికి పాల్పడుతున్నారంటూ గతేడాది సిఐఏ మాజీ అధికారి శామ్ ఫడీస్ ఒక తర్కాన్ని ముందుకు తెచ్చాడు. ఇదంతా తప్పుడు ప్రచారంలో భాగమే అన్నది స్పష్టం. అదే సూత్రం ప్రతి దేశ పౌరులకు వర్తిస్తుంది. అందరినీ అలాగే చూసేట్లైతే ఎవరూ వేరే దేశానికి వెళ్లే అవకాశం ఉండదు. అలాంటి కేంద్రాలన్నీ గూఢచర్యానికి పాల్పడుతున్నట్టు అమెరికా చేసే వాదన అవాస్తవమే అయినప్పటికీ మాటవరసకు నిజమే అనుకుందాం. అలాంటప్పుడు అమెరికా సర్కార్ లేదా అక్కడి సంస్థలు మన దేశంతో సహా ప్రపంచంలో అనేక చోట్ల విద్యా సంస్థలతో సంబంధాలు, అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి, వారాలు , నెలల తరబడి మన వారిని అమెరికా ఆహ్వానిస్తున్నాయి. వాటన్నింటినీ సిఐఏ గూఢచార కేంద్రాలుగా పరిగణించాలా ?

# అమెజాన్ పరిరక్షణ

వాతావరణ సంక్షోభం తీవ్రంగా ముంచుకొస్తున్న తరుణంలో అమెజాన్ అడవుల పరిరక్షణ కోసం దక్షిణ అమెరికా దేశాలు ఒక ఒప్పందానికి రావడం ఆహ్వానించదగిన పరిణామం. బ్రెజిల్‌లోని బెలెమ్ నగరంలో సమావేశమైన ఈ దేశాల నేతలు అమెజాన్ పరిరక్షణ కోసం ఒక కూటమిగా వ్యవహరించాలని నిర్ణయించడం ఒక ముందడుగుగా చెప్పవచ్చు. నిజానికి అమెజాన్ కోపరేషన్ ట్రీటీ ఆర్గనైజేషన్ (ఎసిటిఓ) పేరుతో ఈ దేశాలు కొన్ని దశాబ్దాల క్రితమే ఒక కార్యాచరణను రూపొందించుకున్నప్పటికీ అడుగుముందుకు పడలేదు. 14 సంవత్సరాలుగా ఈ దేశాలు ఒక్కసారి కూడా సమావేశం కాలేదు. దీనిని బట్టే అమెజాన్ విధ్వంసం ఏ స్థాయిలో జరిగిఉంటుందో అర్థం చేసుకోవచ్చు. బ్రెజిల్ నూతన అధ్యక్షుడు లూలా డసిల్వా చొరవతో జరిగిన తాజా సమావేశంలో కొన్ని భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ అమెజాన్ అడవుల పరిరక్షణ విషయంలో ఏకాభిప్రాయం వ్యక్తం కావడం, దాని కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించడం, ఈ కృషికి కలిసి రావాలని అమెరికాతో సహా ఇతర ధనిక దేశాలను సంయుక్తంగా కోరడం వంటి అంశాలు పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో కీలకంగా మారనున్నాయి. ఏడాదికి సగటున 3,800 చదరపు మైళ్ల అమెజాన్ అడవి విధ్వంసానికి గురవుతోంది. గత శతాబ్ద కాలంలో 20 శాతం ఈ అడవుల విస్తీర్ణం తగ్గింది. ఫలితంగా మూలవాసులైన స్థానిక తెగల ప్రజల ఉనికి సైతం ప్రశ్నార్థకంగా మారింది. లూలాకు ముందు బ్రెజిల్ అధ్యక్షుడిగా ఉన్న బోల్సనారో కార్పొరేట్ శక్తులతో చేతులు కలిపి పెద్ద ఎత్తున అమెజాన్ విధ్వంసానికి పాల్పడ్డారు. అభివృద్ధి పేరుతో ఆయన అటవీభూమిలో విచ్చలవిడిగా మైనింగ్ కార్యక్రమాలకు అనుమతిచ్చారు. 1970వ దశకం నుండి ఉన్న పర్యావరణ చట్టాలను నీరుగార్చారు. ఆయన నాయకత్వంలోని చివరి ఏడాది (2022)లోనే 50 లక్షల ఎకరాల్లోని అడవులను నరికివేశారంటే ఏ స్థాయిలో విధ్వంసం సాగిందో అర్థం చేసుకోవచ్చు. ఈ నరికివేత ప్రభావం బ్రెజిల్‌పై తీవ్రంగానే పడింది. అతివృష్టి, అనావృష్టులతో ఆ దేశం అతలాకుతలమైంది. ఈ ఏడాది జనవరిలో అధికారం చేపట్టిన లూలా మైనింగ్‌ను నియంత్రించడంతో పాటు, స్థానిక ప్రజలను చైతన్యం చేయడం ద్వారా నరికివేత వేగానికి కళ్లెం వేయగలిగారు. 2030 నాటికి అమెజాన్ నరికివేతను నూరుశాతం అరికట్టాలని లక్ష్యంగా ప్రకటించారు. బెలెమ్ నగరంలో జరిగిన దక్షిణ అమెరికా దేశాల సమావేశ ప్రారంభంలో భద్రమైన భవిష్యత్‌కోసం అమెజాన్‌ను కాపాడుకుని తీరాల్సిందేనన్న లూలా ఉద్ఘాటన వాతావరణ మార్పులపై ఆయన నిబద్ధతకు నిలువెత్తు దర్పణం పడుతోంది. భూ గోళపు ఊపిరితిత్తులుగా ప్రసిద్ధి కెక్కిన అమెజాన్ అడవుల్లో 30 లక్షల రకాల జంతు జాతులు, 2,500 రకాల వృక్ష జాతులు ఉన్నాయి. భూమి మీద ఉన్న వృక్ష జాతుల్లో మూడవ వంతు ఈ అడవుల్లోనే ఉన్నాయి. 'ఇంటర్ గవర్నమెంటల్ సైన్స్ - పాలసీ ప్లాట్‌ఫామ్ ఆన్ బయో డైవర్సిటీ అండ్ ఎకో సిస్టమ్ సర్వీసెస్ -ఐపిబిఇఎస్ ) నివేదిక ప్రకారం అమెజాన్ విధ్వంసం కారణంగా పది లక్షల జంతుజాతుల ఉనికి ప్రమాదంలో పడింది. వీటిలో కొన్ని ఇప్పటికే కనపడకుండా పోయాయి.

ఈ పరిణామం ఇదే మాదిరి కొనసాగితే భూమిమీద జీవరాశి ఉనికే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది. అందుకే మానవుడితోపాటు సమస్త జీవజాల మనుగడకు అమెజాన్ పరిరక్షణ అత్యంత కీలకం. అయితే, లాభాపేక్షతో కార్పొరేట్లు విచ్చలవిడిగా అడవుల విధ్వంసానికి పాల్పడుతున్నారు. మనుగడ కోసం అమెజాన్ అడవులపైనే ఆధారపడిఉన్న దేశాల అంతర్గత వ్యవహారాల్లో తరచూ జోక్యం చేసుకుంటూ, రాజకీయంగా, ఆర్థికంగా పెత్తనం చెలాయించే అమెరికా అడవులను ధ్వంసం చేస్తున్న కార్పొరేట్లకే అండగా నిలుస్తోంది. స్థానిక రాజకీయ నాయకులను లొంగదీసుకుని వారికి అనుకూలంగా చట్టాలు చేయించడంతో పాటు, ఆయుధాలనూ సరఫరా చేస్తోంది. ఇంధన వనరుల అన్వేషణ, వినియోగం వంటి ఒకటి, రెండు అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ అడవుల పరిరక్షణ విషయంలో దక్షిణ అమెరికా దేశాలు తమ నిర్ణయాన్ని గట్టిగానే వినిపించాయి. ఇప్పుడు సమావేశం జరిగిన బెలెమ్ నగరంలోనే 2025లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో వాతావరణ మార్పులపై కీలక సమావేశం జరగనుంది. మిగిలిన ప్రపంచదేశాలు తాజా నిర్ణయాల స్ఫూర్తిని అందుకుని ఆ సమావేశంలో ఎలా ప్రతిస్పందించనున్నాయో చూడాల్సిఉంది.

## రూరల్ మండలంలో నా భూమి నాదేశం కార్యక్రమం ప్రారంభం



గుడివాడ : మన అమర జవాన్లను, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పౌరులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి భాద్యయని ఎంపిపి గద్దే పుష్పరాణి, ఎంపిడివో వెంకటరమణలు అన్నారు. గురువారం రూరల్ మండలంలోని వలివర్తిపాడులో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మేరీ మాటీ. మేరీ దేశ్ (నా భూమి. నా దేశం) పేరిట నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యసాయ అధికారి బి.అనంతలక్ష్మి, వైయస్ఆర్సీపీ మండల అధ్యక్షులు మట్టా జాన్‌విక్టర్, మాజీ సర్పంచ్ శాయని నాగబాబు, ఉపసర్పంచ్ రవి, బ్యాంక్ అధ్యక్షుడు చింత శ్రీను, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కలపాల కిరణ్‌కుమార్, వైసీపి నాయకలు గద్దె రాము, పంచాయతీ కార్యదర్శి అనుల, జి.రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి మైనార్టీ అధ్యక్షుడిగా షేక్ సర్కార్



గుడివాడ : గుడివాడ నియోజకవర్గ టిడిపి మైనారిటీ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు షేక్ సర్కార్, పట్టణ మైనార్టీ విభాగపు అధ్యక్షుడిగా షేక్ జానీషరీఫ్‌లైనట్లు మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జి రావి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నిమితులైన సర్కార్, జానీషరీఫ్‌లు మాట్లాడుతూ పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని శక్తి వంచన లేకుండా పనిచేసి, టిడిపిని అధికారంలోకి రావడం కోసం కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన మచిలీపట్నం మాజీ పార్లమెంట్ సభ్యుడు, జిల్లా అధ్యక్షులు కోనకళ్ళ నారాయణరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మచిలీపట్నం పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు రాజాలకు కృతజ్ఞతలు తెలిపారు.



## కాపు వనిత క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నరసాపురం, ఆగస్టు 10 (ప్రజాపాలన ప్రతినిధి) : యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ వారి కాపు వనిత క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని గురువారం పట్టణంలోని పుప్పాల వారి దేవిడీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాపు వనిత క్లబ్ రీజనల్ చైర్ పర్సన్ డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కాపు వనిత క్లబ్ ద్వారా కేవలం కాపు వర్గానికే కాకుండా అన్ని వర్గాలవారికి సేవలందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష కాలరును పూర్వపు అధ్యక్షురాలు వలవల సావిత్రి నుండి రీజనల్ చైర్ పర్సన్ డాక్టర్ శిరిగిరినీడి రాజలక్ష్మి చేతుల మీదుగా నూతన అధ్యక్షురాలు పుప్పాల ఉమామహేశ్వరి మెడలో వేసి ఆమెకు అభినందనలు తెలిపారు. నూతన అధ్యక్షురాలు పుప్పాల ఉమామహేశ్వరి మాట్లాడుతూ అందరినీ మమేకం చేసుకుంటూ క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. క్లబ్ నూతన కార్యదర్శిగా బండి స్వర్ణలత, కోశాధికారిగా రంగినీడి భరణి, సహాయ కార్యదర్శిగా తోట భారతి, ఉపాధ్యక్షురాలుగా పిప్పళ్ళ సుప్రజ, పుప్పాల ఉషాకమల్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నిరుపేద మహిళ అయిన సత్తినేని దుర్గకు బియ్యం బస్తా, నిత్యావసర వస్తువులు అందజేశారు. పదవ తరగతి విద్యార్థిని పామర్తి వర్షితకు 5 వేల రూపాయలను ఉపకార వేతనంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కంచర్ల పుష్ప, గంటా వెంకటరమణ, శుంకర రాజకుమారి, మానేపల్లి నాగమణి, శిరిగినీడి రమామణి, పిప్పళ్ళ రాజ్యలక్ష్మి, పుప్పాల రమ, వి .లక్ష్మి, పుప్పాల జ్యోతి, కొండేటి భారతి, కొండేటి పద్మ వెంకటలక్ష్మి, కొండేటి సత్యవతి, పుప్పాల రంగనాథ, అడబాల వాణి, పుప్పాల దీపాదేవి, పుప్పాలపద్మ పాల్గొన్నారు.

## తెదేపా బీసీ సెల్ కార్యవర్గ సమావేశం



నరసాపురం, ఆగస్టు 10 (ప్రజాపాలన ప్రతినిధి) : తెలుగుదేశం పార్టీ పట్టణ బీసీ సెల్ అనుబంధ కమిటీ సమావేశం గురువారం స్థానిక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. నరసాపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి బీసీ సెల్ అనుబంధ కమిటీ సభ్యులందరూ హాజరై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. పట్టణంలో తమ తమ వార్డుల్లో జరుగుతున్న జరుగుతున్న ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొనాలని, మహిళాశక్తి కార్యక్రమం నియోజకవర్గంలో ఎక్కడ నిర్వహించినా బీసీ సెల్ అనుబంధ కమిటీ కార్యవర్గ సభ్యులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు జక్కం శ్రీమన్నారాయణ, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు పెంద్ర శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పాడ సత్యనారాయణ, సోమరాజు శ్రీను, బొద్దు నాగబాబు, ఎలగాని రామకృష్ణ, దేశెట్టి సత్యనారాయణ, పంపన సత్యనారాయణ, దొంగ మురళి తదితరులు పాల్గొన్నారు.

# పంట కాలువను పూడ్చి గెస్ట్ హౌస్ కట్టుకున్నాడు..

### మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



పల్నాడు జిల్లా .వినుకొండ. ఆగస్టు 10 (ప్రజా పాలన ప్రతినిధి.)ప్రతి పక్ష నేత చేస్తున్న ఆరోపణలను తిప్పి కొట్టారు వినుకొండ శాసనసభ్యులు శ్రీ బొల్లా బ్రహ్మనాయుడు గారు. గత లో ప్రభుత్వ భూములను ముల్పూరి అగ్రిటెక్ వారి ద్వారా లోన్ తీసుకున్నానని నా పై అసత్య ఆరోపణలు చేశారు. అసత్య ఆరోపణలు ప్రజలు నమ్మకపోవటం తో మట్టి నాటకానికి తెరలేపారని, అది కుదరక ఇప్పుడు ప్రభుత్వం భూములు కాజేశానని ఆరోపిస్తున్నాడు మాజీ ఎమ్మెల్యే,అసలు రైతుల యెక్క పంట పోలాలకు వెళ్లే ఎన్ ఎస్ పి కాలువ ను పూడ్చి గెస్ట్ హౌస్ కట్టుకున్నది నువ్వు కాదా ఆంజనేయులు.? అక్కడ ప్రభుత్వ భూమి ఉందని నీకు తెలియదు అని అనటానికి సిగ్గులేదా? 10 సంవత్సరాలు ఎమ్మెల్యే గా పని చేసిన నువ్వు పొలం కొనేముందు ఏ భూమి, ఆ భూమికి సంబంధించిన ఆర్ యస్ ఆర్ ను చూసి కొనుకోవాలనే ఇంగిత జ్ఞానం కూడా లేదా నీకు? ప్రభుత్వం భూమిని కాజేసి ఇప్పుడు ఆ అవినీతి బయటపడటం తో కోర్టు ను ఆశ్రయించావు, కోర్టు లో కూడా ఎదురు దెబ్బ తగిలింది, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోమని కోర్టు తీర్పు చెప్పింది. ఇది ఇలా ఉంటే మరో పక్క ప్రభుత్వ భూమి ఉంటే తీసుకోమని నీతులు చెబుతున్నాడు ఈ అవినీతి ఆంజనేయులు.

**లోకేష్ యువతను తప్పుదోవ పట్టిస్తున్నాడు..**

నారా లోకేష్ యువ గళం పాదయాత్ర సభలో యువతకు ఇచ్చే సందేశం స్ఫూర్తి తో ఉండాలి కాని, యువతను తప్పుదోవ పట్టించే లా ఉండకుడదని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గారు తెలియజేశారు. యువత ఉద్యోగాలు చేసి విదేశాలలో ఉన్నతమైన విద్య ను అభ్యసించేలా ఉండాలని కోరుకోవాలే కాని, నీలా నేర చరిత్ర కలిగి ఉండాలని యువతకు సందేశం ఇవ్వకూడదని సూచించారు. నువ్వు ఇచ్చే సందేశం యువ తను నేరస్తులను చేసి వారి జీవాతాలను నాశనం చేస్తుందని తెలిపారు. ఇలానే మీ చంద్రబాబు బాబు నీ పై ఎన్ని కేసులు పెట్టించారని, ఈ యువ పై పెట్టే కేసులు మీ బిడ్డ లపై కూడా పెట్టుకోవచ్చుగా అని ప్రశ్నించారు.? మీరేమో బాగుండాలి యువత నేరస్తులుగా మిగిలిపోవాలా? యువత మేలుకోండి.. ఎక్కడా గొడవలకు పోయి నేరస్తులుగా మీ జీవితాలను నాశనం చేసుకోండి అని సూచించారు.

**29 వేల పై చిలుకు తో వోడిపోయిన సంగతి గుర్తులేదా జివి ఆంజనేయులు...**

2019 లో 29 వేల పై చిలుకు ఓట్లు తో ఓడి పోయిన నువ్వు నా టికెట్ గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉంది. నా పై పోటి చేసే దమ్ము నీకు లేదు, మీ లోకేష్ కి లేదు, దమ్ముంటే రాండి రేపు జరగబోయే ఎన్నికల్లో వినుకొండ ఎమ్మెల్యే గా బొల్లా బ్రహ్మనాయుడు అనే నేను 40 వేల ఓట్ల మెజార్టీతో వైయస్సార్ కాంగ్రెసు పార్టీ జెండా ను ఎగరవేసి చూపిస్తా అని సవాల్ విసిరారు...

# సెప్టెంబర్ నుంచి అన్ని జిల్లాల్లో ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ నుంచి ఫోర్టిఫైడ్ బియ్యంను అన్ని జిల్లాల్లో పీడీఎస్, ఎండీఎం, ఐసీడీఎస్ ల చేయనున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫోర్టిఫైడ్ బియ్యం లో ఐరన్, పోలిక్ ఆమ్లం, బి12 ఉంటాయని, వీటి వలన ఐరన్ రక్తహీనతను నిరోధిస్తుందని, ఫోలిక్ ఆమ్లం రక్తం ఏర్పడటానికి సహాయపడుతుందని, బి12 విటమిన్ తో నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుందని వివరించారు. ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ ను సాధారణ బియ్యంలో 1:100 నిష్పత్తిలో కలపటం వల్లన పోషక బియ్యం తయారవుతుందన్నారు. ఈ బియ్యం గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఫోర్టిఫైడ్ బియ్యంతో శరీరానికి పోషకాలు అందటమే కాకుండ విటమిన్స్ అందుతాయని తెలిపారు. ఫోర్టిఫైడ్ బియ్యం వండటానికి నీళ్లలో కలిపినప్పుడు అవి నీటిపై తేలటంతో ప్లాస్టిక్ అని అవగాహన లేని కొందరు అపోహపడుతున్నారని మంత్రి అన్నారు. మరికొంత మంది కావాలని ప్రభుత్వం ప్లాస్టిక్ బియ్యం సరఫరా చేస్తుందని సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహోన్నత ఆశయంతో రాష్ట్ర ప్రజలకు ఆరోగ్యం చేకూర్చటానికి ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్ గా ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో పంపిణీ చేస్తుండగా ఇకపై రాష్ట్రవ్యాప్తంగా పీడీఎస్, ఎండీఎం, ఐసీడీఎస్ : ద్వారా అందించనున్నట్లు చెప్పారు. దేశంలో ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తున్న రాష్ట్రాల్లో మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ నెల నుంచి ఐసీడీఎస్ ద్వారా గర్భిణీలకు, బాలింతలకు 3 కేజీల పోషక బియ్యం ప్యాకెట్లను ఇంటికే రేషన్ పథకం కింద పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన పెంచటానికి ప్రభుత్వం ఇప్పటికే పోస్టర్లు తయారు చేయటం జరిగిందని, అంతేకాకుండా ప్రముఖ క్రీడాకారిణి పీవీ సింధు తో విడియో కూడా రూపొందించి ప్రచారం నిర్వహించనున్నామని చెప్పారు. విస్తృత ప్రచారం వలన ప్రజల్లో అవగాహన పెంచుతామన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యంతో పాటు రేషన్ దుకాణాల్లో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ కలిపిన గోధుమపిండి కూడా అందించటానికి ఏర్పాట్లు చేస్తున్నామని, ఇందుకు సంబంధించి త్వరలో టెండర్లు కూడా పిలవనున్నట్లు తెలిపారు. బలవర్ధకమైన ఫోర్టిఫైడ్ బియ్యం ప్రతి ఒక్కరూ తీసుకుని అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం ప్లాస్టిక్ బియ్యం అనే అనుమానాలు తీరాలంటే మెడికల్ షాపుల్లో దొరికే అయోడిన్ ను తెచ్చి ఫోర్టిఫైడ్ బియ్యంపై వేస్తే నీలం రంగులోకి మారతాయని వివరించారు. ప్లాస్టిక్ అయితే రంగు మారవు అని అన్నారు. అలాగే నీళ్లలో నానబెట్టినప్పుడు ఫోర్టిఫైడ్ బియ్యం త్వరగా మెత్తబడతాయని, ప్లాస్టిక్ మెత్తబడదన్నారు. ఈ విషయాన్ని పాత్రికేయుల సమావేశంలో ప్రయోగాత్మకంగా మంత్రి చేసి చూపించారు. ఫోర్టిఫైడ్ బియ్యంను పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోనూ తయారు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. రాయలసీమ జిల్లాల్లో రేషన్ పంపిణీలో బియ్యంతో పాటు రాగులు, జొన్నలు అందిస్తున్నామని, ఇకపై రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేయనున్నామని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేర్కొన్నారు. వచ్చే సీజన్ లో 50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ధాన్యం రైతులకు 5 లేదా 6 రోజుల్లో నగదు జమచేస్తామని హామి ఇచ్చారు. దళారీలకు అస్కారం లేకుండా కొనుగోళ్లు ఉంటాయన్నారు. సమావేశంలో పౌర సరఫరాల కమిషనర్ హెచ్. అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధులు దారి మళ్లింపు





బాపట్ల జిల్లా ప్రజపాలన 10 :సర్పంచుల వ్యవస్థను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వంఆంధ్ర ప్రదేశ్ లో ప్రతి కలెక్టరేట్ వద్ద బిజెపి నాయకులు ఆందోళనఅసలే నిధులు లేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేకపోతున్న తరుణంలో కేంద్రం నుంచి వచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయటం లేదు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసే దిశలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక కష్టాల్లో పంచాయతీలురాష్ట్ర సర్కారు సర్పంచుల ఉసురుతీస్తుంది. సర్పంచ్ వార్డు సభ్యులకు తెలియకుండా పంచాయతీ బోర్డు తీర్మానం లేకుండా ఆయా పంచాయతీ ఖాతాల నుంచి నిధులు మళ్లించడం దారుణంగ్రామపంచాయతీలు నిర్వీర్యమైపోయాయి పంచాయతీ ఖాతాల నుంచి నిధులు దారి మళ్ళించడం రాజ్యాంగ విరుద్ధం అప్పులు తేవడం ఆస్తులు అమ్మేయడం కనిపించిన చోట్లల్ల తాకట్టు పెట్టడం ఈ మూడు మార్గాలు అయిపోయాయి ఇప్పుడు పంచాయతీ నిధులు మళ్లింపు మీద పడ్డారు బిజెపి యువ మోర్చా ఉపాధ్యక్షులు కృష్ణ చైతన్యకేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధులను దారి మళ్ళించి సర్పంచుల వ్యవస్థను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వ వైఖరి పై ప్రతి జిల్లా కలెక్టర్ వద్ద గురువారం బిజెపి, జనసేన ఆధ్వర్యంలో మహా నిరసన కార్యక్రమం ను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని బిజెపి పార్టీ యోమోర్చా వైస్ ప్రెసిడెంట్ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. బాపట్ల పట్టణం ఫుడ్ సైన్స్ కళాశాల నందు బిజెపి జనసేన పార్టీ ఆధ్వర్యంలో మహా ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం బిజెపి యువ మోర్చా ఉపాధ్యక్షులు కృష్ణ చైతన్య పాల్గొని వారు మాట్లాడుతూ: పంచాయతీలకు సొంత నిధులు చాలా స్వల్పంగా ఉంటాయి గ్రామంలో వసూలు చేసే ఆస్తి పన్ను కొళాయి పన్ను షాపులు అద్దె రూపంలో వచ్చే ఆదాయంతో పాటుగా చెరువులు ఇతర ఆదాయం వనరుల నుంచి లభించే మొత్తం స్వల్పంగానే ఉంటుంది. సగటున 70% కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని నుంచి వచ్చే నిధుల మీదే పంచాయతీ పాలన సాగుతుంది.కొన్ని మేజర్ పంచాయతీలు మినహా మైనర్ పంచాయతీలు అయితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల మీదనే ఆధారపడతాయి అందులో తలసరి గ్రాంటు వృత్తి పన్ను సీనరేజీ నిధులు, గ్రామంలో జరిగే ఆస్తుల క్రయ విక్రయాలపై రిజిస్ట్రేషన్ ఫీజుల ద్వారా లభించే ఆదాయంతో పాటు వాటా వంటివి పంచాయతీలకు దక్కుతాయి, ప్రస్తుతం తలసరి ఏడాదికి నాలుగు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు గ్రాంటుగా ఇస్తుంది అంటే 3000 జనాభా ఉన్న గ్రామానికి ఏడాదికి దాదాపు 12,000 గ్రాండ్ వస్తుంది.పంచాయతీ నిధుల్లో పారిశుద్ధం రోడ్లు డ్రైన్లు నిర్వహణకు 40 శాతం వరకు ఖర్చు అవుతాయి సిబ్బంది వేతనాలకు మరో 30% ఖర్చు అవుతాయి వీధి దీపాలు తాగునీటి అవసరాలకు 30 శాతం వరకు వెచ్చించాల్సి ఉంటుంది. దాంతో అభివృద్ధి పనులకు ఆస్కారం కలగడం లేదన్నది పంచాయతీల పాలకవర్గాల అభిప్రాయం,పంచాయతీలకు రెండు విడతలగా వచ్చిన నిధులను ఇప్పటికే ఏపీ ప్రభుత్వం విద్యుత్ బకాయిల కింద జమ చేసింది. నిబంధన ప్రకారం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల ఖాతాలకు మళ్ళించి అక్కడ నుంచి విద్యుత్ సంస్థలకు జమ చేసింది. దాంతో అనేక చోట్ల పంచాయతీ ఎకౌంట్లు ఖాళీ అయిపోయాయి,దాంతో ప్రభుత్వం తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలుచోట్ల బిజెపి శ్రేణులు సర్పంచులు ఆందోళనకు పూనుకున్నారు. 73 74 రాజ్యాంగ సవరణల ప్రకారం స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశలో నిధులు కేటాయింపు ఉండాలి కానీ దానికి భిన్నంగా కేటాయించి నిధులను పక్కదారి పట్టిస్తే స్థానిక సంస్థలు ఏం కావాలి, బిజెపి యువ మోర్చా కృష్ణ చైతన్య ప్రశ్నించారు.

## వర్గీకరణకు అనుకులించే పార్టీలకే ఎంఆర్‌పిఎస్ మద్దతు

**ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపొగు సురేష్‌మాదిగ**

**వైసిపి మాదిగలను మోసం చేసింది**



గుడివాడ : వర్గీకరణకు మద్దతు ఇచ్చే పార్టీలకు మంద కృష్ణమాదిగ నాయకత్వంలోని రాష్ట్ర ఎంఆర్‌పిఎస్ పూర్తి మద్దతును ఇస్తుందని, గత ఎన్నికల్లో జగన్‌మోహరెడ్డి ప్రభుత్వం మోసం చేసిందని అలాంటి వారికి బుద్ది చేపేందుకు మాదిగలు సిద్దంగా ఉన్నారని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపొగు సురేష్ అన్నారు. గురువారం స్థానిక రైలేపేటలోని వేల్పూల నాగబాబు అధ్వర్యంలో మాదిగ రిజ్వరేషన్ పోరాట సమితి గుడివాడ నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌మాదిగ మాట్లాడుతూ 29సం॥లుగా ఎస్సీ వర్గీకరణకోసం పోరాటం చేస్తున్న కృష్ణమాదిగ అధ్వర్యంలో అనేక పోరాటాలు చేయడం వల్లే నేడు రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అములు అవుతున్నట్లు వాటిలో వితంతువుల పెన్షను, నేడు అములు అవుతున్న అరోగ్యశ్రీ, తదితర పథకాలు అములు అవుతునయన్నారు. 2019 ఎన్నికల్లో జగన్‌మోహనరెడ్డి మాదిగలకు న్యాయం చేస్తాని చెప్పి మోసం చేసారన్నారు. బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లో అర్టికల్ 341ని సవరించి, ఎబిసిడి వర్గీకరణ బిల్లును అమోదించాలన్నారు. మాదిగల ఉపాధికోసం, ఉద్యోగ అవకాశాలు, వర్గీకరణ అములు, మాదిగల సంక్షేమం కోసం కృష్ణమాదిగ అధ్వర్యంలో ఈ నెలలో హైదరబాద్‌లో విశ్వరూప మహసభను లక్షాల మందితో నిర్వహిస్తుందన్నారు. ఈ సభకు మాదిగ, ఉపకులాలు ఈ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి కోట దానియేలు, ఇంటూరి గంజేంద్ర, కలపాల వికాష్, కోదమల గంగాధర్, పసలాది శేఖర్, అత్తాటి సాల్మన్, జేమ్స్, వేల్పూల కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ హింసను సభ్య సమాజం ఖండించాలి

## సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని




విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి ఆగష్టు. 18 : ఏ సమాజం లో నైనా హింస హానికరం అని, రాజకీయ హింస ను సభ్య సమాజం ఖండించాలని సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. స్థానిక ఒక ప్రయివేటు సమావేశ మందిరం లో "ఆంధ్ర ప్రదేశ్ లో హింసా రాజకీయాలు, నివారణ చర్యలు – మీడియా పాత్ర " అంశంపై సి.ఆర్. మీడియా అకాడమీ, ఎడిటర్స్ అసోసియేషన్ లు సంయుక్తంగా గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సదస్సు కు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పుంగనూరు లో జరిగిన సంఘటన నేపథ్యంలో "రాజకీయ హింస" పై మేధావులు, పాత్రికేయులు, రాజకీయ పక్షాలు ప్రజల్ని అప్రమత్తం చేయాల్సిన అవసరం ఏర్పడిందని కొమ్మినేని అన్నారు. తెలంగాణ లో నిర్మల్ వద్ద అక్బరుద్దీన్ ఒవైసీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు జైలు శిక్ష అనుభవించిన సంగతి గుర్తుచేస్తూ, నేరపూరిత ప్రవర్తన, శాంతి భద్రతల విఘాతం వంటి దుశ్చర్యలకు పాల్పడడం అంటే శిక్ష అనుభవించేందుకు స్వయంగా సిద్ధ పడడమే అన్నారు. , నేర పూరిత స్వభావం కలిగినసాధారణ వ్యక్తులు ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడితే అందుకు ప్రభుత్వాలు చట్ట ప్రకారం శిక్షిస్తుందని అన్నారు. అయితే, ఇలా హింసను ప్రేరేపించిన వ్యక్తి ఈ రాష్ట్రానికి 14 ఏళ్ళు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి కావడం మన దురదృష్టం అని ఆయన అన్నారు. ఈ సంఘటనలో హింసకు పాల్పడినవారెవరో, బాధితులెవరో అందరికీ తెల్సినా, కొన్ని పత్రికలు, వార్తా చానెళ్లు, ''టి.డి. పి. కార్యకర్తలు తిరగబడ్డారని'', ''పోలీసులదే తప్పని'' వక్రీకరించిన వార్తలు రాయడం, ప్రసారం చేయడం జరుగుతోందని విమర్శించారు. ఈ హింసా కాండ లో కన్ను కోల్పోయిన కానిస్టేబుల్ పై కనీస సానుభూతి చూపని ప్రధాన ప్రతి పక్ష నేత, రాజకీయ పక్ష నేతలు ప్రజలకు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. ప్రజల రక్షణ లో తమ కన్ను కోల్పోయిన కానిస్టేబుల్ కు సదస్సు సంఘీభావం ప్రకటించింది. రోడ్ షో ల వల్ల శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని, మారణ హోమం జరుగుతుందని ప్రభుత్వ వాదన కోర్టుల్లో నిల్వ లేదని, దాని పర్యవసానమే ఈ సంఘటన అని ఆయన అన్నారు. ముఖ్య అతిథి గా హాజరైన అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయ్ బాబు మాట్లాడుతూ పోలీసుల పైజరిగిన దాడులకు చంద్ర బాబు ప్రజలకు జావాబు చెప్పాలన్నారు. ఈ సంఘటన పై నేషనల్ హ్యూమన్ రైట్స్ కమీషన్ తక్షణమే స్పందించాల్సి ఉందన్నారు. రాష్ట్ర మానవ హక్కుల సంఘం కూడా జోక్యం చేసుకోవాలని కోరారు. రాజ్యాధికారాన్ని గెలుచుకోవాలి అంటే, ప్రజల మనస్సు గెలుచుకోవాలని ఆయన అన్నారు. అంతేగాని, అల్లర్లు,అరాచకం సృష్టించడం తగదు అని ఆయన అన్నారు. వజ్ర పోలీస్ వాహనానికి నిప్పు పెట్టడాన్ని ప్రమాదు వశాత్తు తగలబడినట్లు రాస్తే అది పత్రికా విలువల్ని కాలరాయడమే అన్నారు. నవరత్నాలు అమలు కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు నారాయణ రావు మాట్లాడుతూ రాజకీయాలను అడ్డుపెట్టుకుని హింసను ప్రోత్సహించడం సరైన వద్దతి కాదని, ఇటువంటి చర్యలను అరికట్టాల్సి ఉందని అన్నారు. ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.వి.ఆర్. కృష్ణంరాజు మాట్లాడుతూ ఏదోవిధంగా అధికారాన్ని హస్తగతం చేసుకోవడం కోసం హింసను ప్రేరేపించడం సమాజానికి ప్రమాదకరమని అన్నారు. అరాచక, తీవ్రవాద రాజకీయ ధోరణులు మొగ్గలోనే త్రుంచి వేయాలన్నారు. ఈ సంఘటన పై జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. రిటైర్డ్ జిల్లా పోలీస్ సూపరింటెండ్ చక్రపాణి మాట్లాడుతూ ప్రతిపక్షాలు విధాన పరమైన లోపాల్ని ఎత్తి చూపాలే తప్ప అరాచక ధోరణులకు తెగబడకూడదు అన్నారు.లక్కరాజు సునీత మాట్లాడుతూ "ఫ్రస్ట్రేషన్" తోనే ఇటువంటి దాడులకు ప్రతివక్ష నేతలు పాల్పడుతున్నారన్నారు.సదస్సులో ఆకుల శ్రీనివాసులు, జి.శాంతమూర్తి, రెహ్మాన్ సాహెబ్, వెంకట్ ఎస్. మేడపాటి, సలాది పూర్ణ చంద్రరావు మలిరెడ్డి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి:ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు





గోకవరం. ఆగస్ట్ 10. ప్రజా పాలన ప్రతినిధి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు డ్రామా పీడి పీ.అచ్చుతాంబ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన ఆజాదీగా అమృత్ మహోత్సవ్ మండలంలోని కామరాజుపేట, గంగంపాలెం, గుమ్మళ్ళదొడ్డి గ్రామాల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నా భూమి, నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమన్ని ఎంపీపీ కొబ్బరి మొక్కలు నాటారు ప్రారంభించారు. ఎంపీపీ. డ్వామా పీడీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా ప్రతీ గ్రామం నుంచి మట్టిని సేకరించి ఢిల్లీకి పంపించడం జరుగుతుందన్నారు. ప్రతీ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని, దీనికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, ఎంపీడీఓ కె.పద్మాజ్యోతి, ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, ఏపీఓ అప్పలరాజు, కార్యదర్శి గోపన్న దొర.కార్యదర్శి ప్రేమ్ కుమార్. నాయకులు తోలేటి రాంప్రసాద్, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు. తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడలో పారదర్శకంగా ఓటర్ లిస్టులు రూపొందించాలి: మాజీ ఎమ్మెల్యే రావి



గుడివాడ : అవకతవకలు లేకుండా పారదర్శకంగా ఓటర్ల లిస్టులు రూపొందించాలని మాజీ ఎమ్మెల్యే,టిడిపి ఇన్చార్జ్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక 125వ బూత్‌లో నిర్వహిస్తున్న ఓటర్ల సర్వేను టిడిపి నేతలతో కలిసి రావి పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్నికల సంఘ నిబంధనల ప్రకారంగానే సర్వే నిర్వహించాలని సూచించారు. ఓటర్ల సర్వేను నిర్వహించాలంటూ అనేక ఏళ్లుగా చేస్తున్న డిమాండ్‌ను ప్రభుత్వాలు పట్టించుకోకపోయినా ఎన్నికల సంఘం ప్రక్రియ చేపట్టడం హర్షనీయమన్నారు. ప్రధానంగా ఓటర్ల సర్వేలో వాలంటీర్ల భాగస్వామ్యం కాకుండా ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోవడాన్ని తాము పూర్తిగా స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల సర్వేలో సర్వర్ సమస్యలపై కలెక్టర్ దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నాయకులు ముల్లపూడి రమేష్, పోలాసి ఉమా, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో 4వ వార్డు పనసతోటలోని మోహర్రం చిన్న పిల్లల పీర్ల పండుగ

## ముఖ్యఅతిథిగా నరసరావుపేట గౌరవ శాసనసభ్యులు డా. గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



మల్లాడి జిల్లా. నరసరావుపేట. ఆగస్టు 10 (ప్రజాపాలన ప్రతినిధి): నరసరావుపేట పట్టణంలో 4వ వార్డు పనసతోటలోని మోహర్రం చిన్న పీర్ల పండుగ వైభవంగా జరిగింది. ప్రతి ఏటా చిన్న పిల్లల పీర్ల పండుగ తొమ్మిది రోజుల పాటు పీర్ల ను కూర్చో బెట్టారు. బుధవారం రాత్రి పీర్ల చావిళ్లలో దేవుళ్లను కొలువు తీర్చి ప్రత్యేక ప్రార్ధనలు గౌరవ శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. పీర్ల పండుగ ఎంతమాత్రం తగ్గకుండా స్థానికులు, ముఖ్యంగా యువత పీర్ల చావిళ్లను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. చెక్కర సదివింపులు, పానకాలు భక్తులకు అందించారు.పట్టణ మరియు గ్రామంలో పెద్దగా ముస్లిం కులస్తులు పీర్ల పండగను కులమతాలకు అతీతంగా గ్రామస్తులు నేటికి అంగరంగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది ఆనావాయితీగా



గ్రామస్తులంతా ఏకమై గ్రామ నడిబొడ్డున ఉన్న పీర్ల కొట్టంలో మండలంలో ఎక్కడా లేని విధంగా 12 పీర్లను ప్రతిష్ఠిస్తారు. మోహర్రం మాసంలో పుణ్యం కలుగాలని కోరుకుంటూ కొత్తమంది భక్తులు పది రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపడతారు..పెద్ద ఎత్తున వారం రోజుల పాటు రాత్రి వేళలలో డప్పు దరువులు, జానపద గేయాలు పాడుతూ అలువా ఆటను ఆడుతారు. ఆలువా ఆటను చూడడానికి ఊరి జనమంతా తరలివచ్చి గంటల తర బడి ఆసక్తిగా తిలకిస్తారు. డప్పు చప్పుళ్ల మధ్య పీర్లను ఊరేగింపుగా ఇంటింటికీ తిరుగగా ఊదు, దట్టీలు, మలీద ముద్దలు, బెల్లం, కానుకలు సమర్పించుకొని భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. గ్రామ ప్రధాన వీధుల్లో మేళ తాళాల మధ్య పీర్లను ఊరేగించి సమీప చెరువులో నిమజ్జనం చేస్తారు. ఉత్సవాల ముగింపు కార్యక్రమం రోజున ఏలాంటి బేదాభిప్రాయాలు లేకుండా కులమతాలకు అతీతంగా జనజాతరలా కొనసాగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక నాలుగో వార్డు ముస్లిం మైనార్టీ సోదరీ సోదరీమణులు, పెద్ద ఎత్తున చిన్న పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల మందులు పంపిణీ



బాపట్ల జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని నులిపురుగుల మందులు పంపిణీ లో భాగంగా బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు మరియు ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు కర్లపాలేం మండలం నల్లమోతు వారి పాలెం వెన్నెలగంటి నగర్ (ఎస్ టి కాలనీ)లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నులిపురుగుల మందు ను పంపిణీ చేసి ఆరోగ్య పరంగానూ మరియు తీసుకునే ఆహార పదార్థాల విషయం లోనూ పాటించవలసిన జాగ్రత్తలు గురించి తెలియ జేశారు. నులిపురుగులు ల మందుల పంపిణీ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వెంకటేశ్వర రావు, ANM రత్న మాల, విలేజ్ హెల్త్ క్లినిక్ అసిస్టంట్ అనూష, అంగన్ వాడి ACDPO శివ పార్వతి, ఆంగన్ వాడి సూపర్వైజర్ సౌజన్య, అంగాన్ వాడి టీచర్స్, ఉపాధ్యాయుడు విజయ్ కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం సందర్భంగా మాత్రలు మింగిదిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి జోష్న



బద్వేలు ప్రజాపాలన ప్రతినిధి: బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో బాలుర ఉన్నత పాఠశాల బద్వేల్ నందు "జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం డాక్టర్ పి. జోత్స్న మరియు డాక్టర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది .సందర్బంగా మాట్లాడుతూ రక్తహీనత లేని సమాజం నిర్మిద్దాం అన్నారు .డాక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ నులిపురుగులు ఉండడంవల్ల రక్తహీనత, నీరసం, ఆకలి మందగించడం, కడుపునొప్పి మొదలగు లక్షణాలు వుంటాయని కావున పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆహారం తీసుకొనే ప్రతిసారి చేతులు శుభ్రం చేసుకోవాలని, నులిపురుగుల నిర్మూలన కోసం సంవత్సరం నకు రెండు సార్లు 1 నుండి 19 సంవత్సరాల పిల్లల వరకు అల్బెండజోల్ మాత్రలను అంగన్వాడీ కేంద్రం, స్కూల్ మరియు కాలేజీ ల ద్వారా ఇవ్వటం జరుగుతుంది. కావున అందరు పిల్లలు ఈ మాత్రలు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జోష్న మరియు డాక్టర్ వినయ్ కుమార్ మండల విద్యాధికారిని ప్రమీల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరిముల్లా మరియు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు,హెల్త్ ఎడ్యుకేటర్ బి.వెంగయ్య ఏఎన్ఎం, సిహెచ్ఓ సూపర్వైజర్స్ జనార్ధన్ శ్రీరాములయ్య,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమ శకానికి సీఎం జగన్ నాంది: రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో సంక్షేమ శకం నడుస్తోందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 60 వ డివిజన్ 267వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, వైసీపీ డివిజన్ ఇంఛార్జి బెవర నారాయణ, డివిజన్ అధ్యక్షులు బత్తుల దుర్గారావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. వాంబే కాలనీ జీ బ్లాక్ లో విస్తృతంగా పర్యటించి 387 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ లబ్ధిని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు పేద కుటుంబాలకు అండగా నిలిచి, ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నాయని మల్లాది విష్ణు తెలిపారు. అలాగే ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వచ్చిన సమస్యలను నూటికి నూరు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి సూచించారు.వాహనమిత్ర లాంటి పథకం దేశంలో ఎక్కడా అమలులో లేదని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. పర్యటనలో భాగంగా ఆటో కార్మికులతో కాసేపు ఆయన ముచ్చటించారు. 2018 మే 14న ఏలూరులో తనను కలిసిన ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే వాహనమిత్ర పథకానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారని మల్లాది విష్ణు అన్నారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఏటా రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందించడం దేశంలోనే ప్రప్రథమని తెలిపారు.వాహన నిర్వహణ, ఇన్సూరెన్స్ ప్రీమియం, ఫిట్ నెస్ ఫీజులను చెల్లించేందుకు ఈ ఆర్థిక సాయం ఉపయోగపడుతోందని ఆటో డ్రైవర్లు చెప్పడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ ప్రతిపక్షాలు హింసను ప్రేరేపిస్తున్నాయని మల్లాది విష్ణు విమర్శించారు. రాయలసీమలో ఒకరు, ఉత్తరాంధ్రలో మరొకరు పర్యటిస్తూ ప్రజలను రెచ్చగొడు తున్నారని దుయ్యబట్టారు.అంగళు ్లలో సాక్షాత్తూ చంద్రబాబు సమక్షంలోనే టీడీపీ శ్రేణులు తొడలు కొడుతూ, చెప్పులు చూపుతూ రెచ్చగొట్టినట్లు స్పష్టమైందన్నారు. పుంగనూరులో తెలుగుదేశం అరాచక మూకల దాష్టీకాన్ని రాష్ట్రమంతా చూసిందని టీడీపీ చేసిన విధ్వంసానికి ఒక కానిస్టేబుల్ చూపు పోయిందని మల్లాది విష్ణు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేనిదే ఏపీలోకి సీబీఐ రాకూడదని భయంతో ఆనాడు జీవో జారీ చేసిన చంద్రబాబు మరలా ఏముఖం పెట్టుకుని సీబీఐ ఎంక్వైరీ కోరుతున్నారని మల్లాది విష్ణు ప్రశ్నించారు. గతంలోనూ టీడీపీ చర్యల వల్ల గుంటూరు, కందుకూరులో 11 మంది అమాయకులు చనిపోయారని గుర్తుచేశారు. ప్రజల ప్రాణాలు పోతుంటే ఈ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మరోవైపు ఏపీలో ఉంటూ తెలంగాణ జపం చేసే పవన్ కళ్యాణ్ కు విశాఖ గూర్చి మాట్లాడే నైతిక అర్హత లేదని మల్లాది విష్ణు అన్నారు. కార్యక్రమంలో సీడీఓ జగదీశ్వరి, నాయకులు ఎండి ఇస్మాయిల్, ఎస్.డి.బాబు, పఠాన్ నాగుర్, షేర్ అలీ, షేక్ ఫాతిమా, కోడూరు గోపి, సిరిసెట్టి రాజా, ఉమా, సౌజన్య, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబుపై దాడి కేసును సిబిఐకి అప్పగించాలి



భీమవరం, ఆగస్టు 10 (ప్రజాపాలన ప్రతినిధి) : తెదేపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుపై వైసీపీ ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులను సిబిఐకి అప్పగించాలని పశ్చిమ గోదావరి జిల్లా తెదేపా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్చార్జి తోట సీతారామలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం ఆమె స్థానిక జిల్లా తెదేపా కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు దాసరి ఆంజనేయులుతో కలిసి మాట్లాడుతూ అంగళ్లలో జరిగిన ఘటనను ప్రజలందరూ గమనిస్తున్నారని అత్యంత కట్టుదిట్ట భద్రత వలయంలోని కేంద్ర ప్రభుత్వ జడ్ ప్లస్ సెక్యూరిటీ గార్డుల సమక్షంలో చంద్రబాబు పర్యటనను అడ్డుకోవాలని వైసీపీ గూండాలు, రౌడీలు చేస్తున్న దౌర్జన్య అరాచకాలను చంద్రబాబు నాయుడు ప్రశ్నించినందుకు ఆయనపై అక్రమ కేసులు బనాయించి ఆయనను అరెస్టు చేసి జైలులో పెట్టాలని ముఖ్యమంత్రి జగన్ కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో జగన్ కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పనున్నారని అని అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, భీమవరం నియోజకవర్గ పరిశీలకుడు దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ వైసీపీ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో నిర్వీర్యం చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై యుద్ధభేరి ప్రకటించిన చంద్రబాబు పర్యటనను ముఖ్యమంత్రి జగన్ అడ్డుకోవాలని మంత్రి పెద్దిరెడ్డి అతని అనుచరులతో టిడిపి నాయకులపై దాడి చేయించి పోలీసులతో తెదేపా నాయకులతో పాటు చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమని దీనిని తాము ఖండిస్తున్నామని అన్నారు.

## జెసి ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలపై భగ్గుమన్న నాయిబ్రా హ్మణ సేవా సంఘం



నందిగామ ఆగస్టు 10 ప్రజాపాలన ప్రతినిధిఇటీవల కాలంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ఇంటర్వ్యూలో జెసి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఒక సందర్భంలో నాయి బ్రాహ్మణులను కించపరిచే విధంగా మంగలోడా అనే పదజాలంతో మాట్లాడిన తీరును నందిగామ నాయి బ్రాహ్మణ సంఘం ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిం చారు అతనిపై సంబంధిత అధికారులు పోలీసులు ప్ర భుత్వం చర్యలు తీసుకొని తక్షణమే అరెస్టు చేయాల ని వారు డిమాండ్ చేశారు ఇలాంటి వ్యాఖ్యలు అత ని దిగజారుడుతనానికి నిదర్శనమని కండకావరంతో కుల అహంకారంతో ఇలాంటి దుర్భాషలు వాడారని వారన్నారు ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణసంఘ అధ్యక్షులు దాసు జయరాం గౌరవాధ్యక్షులు అన్నవర పు గణపతిరావు నటరాజు రాయల శ్రీను తదితర నా యకులు పాల్గొన్నారు

## 9 రోజులుగా కొనసాగుతున్న రాజన్న ఉచిత భోజనం



జగ్గయ్యపేట ఆగస్టు 10 ప్రజాపాలన ప్రతినిధిపట్ట ణంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు రాష్ట్ర ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉద యభాను ఆధ్వర్యంలో నిరంతరం జరిగే రాజన్న ఉ చిత భోజన కార్యక్రమానికి అడ్వకేట్ ఈశ్వరప్రగడ వెంకట జగన్నాథరావు కుమారుని జన్మదిన సంద ర్భంగా ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమాన్ని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్ర సాద్ బాబు ప్రారంభించారుఈ సందర్భంగా ప్రసాద్ బాబుమాట్లాడుతూ అభాగ్యులకు, అనాథలకు,నిరుపేదలకు,జగ్గయ్యపేట పట్టణానికి వివిధ పనుల మీద వ చ్చే వారి ఆకలని తీర్చడానికి ఈ రాజన్న ఉచిత భోజ నం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలి పారు

## నులి పురుగుల నివారణ మందులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్‌రావు



వీరులపాడు ఆగస్టు 10 ప్రజాపాలన ప్రతినిధి మండ లంలోని అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని గురువారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మా త్రలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ శారీరకంగా ఎదుగుదల సవ్యంగా ఉండేం దుకు నులిపురుగుల మందులు అందజేయాలని తె లి పారు. విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందు కు వ్యక్తిగత శుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నులిపురుగులను నివారిస్తేనే చిన్నారు ల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని చెప్పారు. చిన్నారు లు ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేసుకోవా లన్నారు. ప్రభుత్వం వీటిని ఉచితంగా పంపిణీ చేస్తుం దని వివరించారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్ర తినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నా యకులు పాల్గొన్నారు

# పచ్చదనం పెంపునకు ప్రతిన బూనుదాం..

## రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : మొక్కలను పెంచి పచ్చదనాన్ని పంచే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆంధ్రప్రభ కాలనీలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి బుధవారం మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పచ్చదనం పరిఢవిల్లితేనే మానవాళి మనగడ సాధ్యమవుతుందన్న విషయాన్ని బాధ్యతగల పౌరులందరూ గ్రహించాలని ఈ సందర్భంగా మల్లాది విష్ణు పేర్కొన్నారు. అడవుల విస్తీర్ణం తగ్గిపోయి పట్టణాలు, గ్రామాలు కాంక్రీట్ జంగిల్స్ గా మారిపోతున్న ప్రస్తుత తరుణంలో.. మన ఇంటి పరిసరాల్లో పచ్చదనాన్ని పెంచవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మల్లాది విష్ణు అన్నారు. నానాటికి పెరుగుతున్న కాలుష్య కోరల నుంచి నుంచి బయటపడాలంటే.. మొక్కలను పెంచడం ఒక్కటే మార్గమన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జగనన్న పచ్చతోరణం పేరిట కొన్ని లక్షల మొక్కలు నాటినట్లు మల్లాది విష్ణు చెప్పారు. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విరివిగా మొక్కలు నాటుతుండటంతో క్రమంగా నియోజకవర్గంలో పచ్చదనం పెరుగుతోందన్నారు. కొత్తగా నిర్మితమవుతున్న జగనన్న కాలనీలలోనూ తప్పనిసరిగా మొక్కలు పెంచాలనే నిబంధనను ప్రభుత్వం విధించిందని గుర్తుచేశారు. చెట్లే మానవ జాతికి గురువులని.. కనుక ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఒక మొక్కను దత్తత తీసుకోవాలని మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. మొక్కలను నాటి వదిలేయడమే కాకుండా వాటిని పరిరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. ట్రీ గార్డులను ఏర్పాటు చేయడం ద్వారా 95 శాతానికి పైగా మొక్కలను కాపాడుకోవచ్చున్నారు. ప్రభుత్వ అధికారులు, కార్పొరేటర్లు, స్వచ్ఛంద సంస్థలు పర్యావరణ పరిరక్షణలో ప్రజలను భాగస్వాములను చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. తత్ఫలితంగా విజయవాడ నగరమంతా పచ్చదనం పరిఢవిల్లుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్కు సూపర్ వైజర్ విక్టర్, నాయకులు ఆత్మకూరు సుబ్బారావు, గుండె సుందర్ పాల్, ఉమ్మడి వెంకట్రావు, తోపుల వరలక్ష్మి, శోభన్, నాగుల్ మీరా, బుజ్జి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో బ్రాహ్మణులకు రక్షణలేదు



భీమవరం, ఆగస్టు 10 (ప్రజాపాలన ప్రతినిధి) : ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్రంలో బ్రాహ్మణులపై దాడులు పెరిగిపోయాయని బ్రాహ్మణుల సంక్షేమాన్ని నిర్వీర్యంచేసి బ్రాహ్మణులకు రక్షణ లేకుండా చేసిన జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని తెదేపా బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బుచ్చి రామప్రసాద్ అన్నారు. గురువారం ఆయన స్థానిక గునుపూడి శివాలయంలో వైసిపి నాయకుని చేతిలో దాడికిగురైన పంద్రంగి పవన్ శర్మను పరామర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూజకు అడ్డంగా ఉన్నారని పక్కకి ఉండమని చెప్పినందుకే పూజారిపై దాడిచేసి తిరిగి కేసుపెట్టడం వైసీపీ పార్టీకే చెల్లిందన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న టిటిడి మాజీ పాలకమండలి సభ్యులు ఏవి రమణ మాట్లాడుతూ గత తెలుగుదేశంపార్టీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్రాహ్మణులకు అనేక సంక్షేమ పథకాలను అమలుచేసి ఆదుకున్నారని జగన్ ప్రభుత్వం వచ్చాక బ్రాహ్మణులకు ఎటువంటి అభివృద్ధి లేకపోగా దాడులు పెరిగాయని విమర్శించారు. దాడికి గురైన పవన్ మాట్లాడుతూ తనపై జరిగిన అన్యాయానికి ట్రస్ట్ బోర్డు చైర్మనతో రాజీనామా చేయించడం తనకు న్యాయం జరిగిందని ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా బ్రాహ్మణులకు అవమానం కలగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల నాయకులు వేలూరి సుబ్రహ్మణ్యశర్మ, చెరకుపల్లి సంతోష్ కుమార్, వేలూరి శ్రీధర్, మిర్తిపాటి గున్నేశ్వరరావు, బొంతనబట్ల పద్మ, పట్టణ టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, నాయకులు ఎద్దు ఏసుపాదం, మాదాసు కనకదుర్గ, ఎండి షబీనా, ఎస్.డి నసీమాబేగం, పాలా శ్రీరామదాసు, విజ్జురోతి రాఘవులు, మల్లువలస రాము, యర్ర వెంకట సత్యనారాయణ, మద్దుల మూర్తి, దొంగ వెంకటేశ్వరరావు, భీమనాదం శేషారావు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలో గుంటు కోటయ్య ఏ.వెంకటమ్మ నూతన గృహప్రవేశం వేడుక

**నరసరావుపేట గౌరవ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దంపతులు**



పల్నాడు జిల్లా. నరసరావుపేట. ఆగస్టు 10.( ప్రజాపాలన ప్రతినిధి): నరసరావుపేట నియోజకవర్గం లోని ఉప్పలపాడు గ్రామ శివారులోని జగనన్న కాలనీలో "గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మెమోరియల్ వారి సుస్మిత ఆర్తో %ఽ% ట్రామా కేర్ హాస్పిటల్" సీనియర్ సిబ్బంది గుంటు కోటయ్య ఏ వెంకటమ్మ నూతన గృహప్రవేశం మహోత్సవానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట గౌరవ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి , డాక్టర్ సుస్మిత హాజరయ్యారు. అనంతరం కోటయ్య కుటుంబసభ్యులతో కలిసి గౌరవ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దంపతులు చేతుల మీదగా రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. కోటయ్య నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. బెడ్ రూమ్, హాలు, కిచెన్ గదులను హౌసింగ్ సిబ్బంది డాక్టర్ గోపిరెడ్డి కి వివరించారు అనంతరం కోటయ్య దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు..ఈ కార్యక్రమంలో హౌసింగ్ డి.ఈ , మున్సిపల్ సిబ్బంది, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మొక్కలు నాటితే పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ ఆహారం మరియు ఆక్సిజన్ను అందిస్తాయి



పల్నాడు జిల్లా .నరసరావుపేట. ఆగస్టు 10 (ప్రజాపాలన ప్రతినిధి): "మొక్కలు పర్యావరణ సమతుల్యతను కాపాడుతూతాయి వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే శోభనబాబు"గురువారం జె ఎన్ టి యు కాకాని క్యాంపస్ లో ఎన్ఎస్ఎస్ యూనిట్ వారి ఆధ్వర్యంలో "నా మట్టి నా దేశం ప్రొగ్రామ్ లో"భాగంగా, దత్తత గ్రామాము అయినటువంటి కాకాని గ్రామములో ఉన్న జె ఎన్ టి యు క్యాంపస్ లో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమములో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే శోభనబాబు మాట్లాడుతూ మొక్కలు మానవులకు మరియు జంతువులకు చాలా సహాయకారిగా ఉంటాయి. అవి ప్రాణుల మనుగడకు అవసరమైన ఆక్సిజన్ను ఉత్పత్తి చేస్తాయి. జంతువులు చెట్లలో ఆశ్రయం పొందుతాయి, ఇవి వాటి ఔషధ గుణాలకు కూడా గుర్తింపు పొందాయి. మొక్కల యొక్క విభిన్న భాగాలు మొత్తం స్కీమ్లో విభిన్న పాత్రలను పోషిస్తాయి. ఇవి పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ ఆహారం మరియు ఆక్సిజన్ను అందిస్తాయి.కాకాని గ్రామానికి సంబందించిన మాజీ సైనికులను గుర్తించి వారిని మరియు సర్పంచ్, వర్డ్ మెంబర్లు లను కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె శోభన్ బాబు వివిధ విభాగ అధిపతులు కలిసి సన్మానించారు, ఈ కార్యక్రమములో కాకాని గ్రామా సర్పంచి దుర్గాప్రసాద్ దండా వీరాంజనేయులు మెకానికల్ విభాగ అధిపతి శ్రీమతి ఐ ఫణిసుష్మా ఎలట్రానిక్స్ విభాగ అధిపతి డాక్టర్ %ూ% గంగాధర్ ఎలట్రికల్ ప్రాజెక్ట్ ఇంజనీర్ డాక్టర్ కే విమల్ కుమార్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి పీ రాజు, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థిని విద్యార్థులు మొక్కలు నాటే ప్రోగ్రామ్ లో పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్ .శ్రీనివాసరావు వెన్నుండి ప్రోత్సహాన్ని ఇచ్చేరు

## ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నది ఎస్.ఎఫ్.ఐ




నందిగామ ఆగస్ట్ 10 ప్రజా పాలన ప్రతినిధి పట్టణంలోని స్థానిక యుటిఎఫ్ భవనంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల ప్లేనరీని నిర్వహించారు ఎం సో మేశ్వరరావు మాట్లాడుతూ నిర్లక్ష్యం చేస్తుందని ఆయ న అన్నారుమాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు కే.గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఎ క్కువ నిధులు కేటాయించాలని, పెండింగ్ లో ఉన్న ఫీ జు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చే యా లని, అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థికి జగనన్న అమ్మ ఒ డి, వసతిదీవెన, విద్యదీవెన ఇవ్వాలని, జి.ఓ నెంబర్ 77 వెంటనే రద్దు చేసి పిజి విద్యార్థులకు ఫీజు రీయిం బర్స్మెంట్ ఇవ్వాలని అని కోరారు.ఎస్ఎఫ్ఐ నూతన మండల కమిటీ ఎన్నిక జరిగినది మండల అధ్యక్షుడు గా పి.రవి, మండల కార్యదర్శిగా జి.గోపి నాయక్ ల ను ఎన్నుకున్నారు. ఆరుగురును మండల కార్యదర్శి వర్గంలో తీసుకున్నారు. కాజు, ఆదిత్య ల ను మండల ఉ పాధ్యక్షులుగా, సహాయ కార్యదర్శి లుగా రఫీ, వెం కటేశ్వర్లులను 10 మందిని మండల కమిటీ సభ్యులు గా ఎన్నుకోవడం జరిగింది.

## ఘనంగా సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలు



పల్నాడు జిల్లా. నరసరావుపేట టౌన్ .ఆగస్ట్ 10 : (ప్రజా పాలన ప్రతినిధి. )ఘనంగా సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలు . బుధవారం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గల లూథరన్ అంధుల పాఠశాలలోని ఆవరణ లో టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ-మహేష్ బాబు యువశక్తి పట్టణ అధ్యక్షుడు ఎండి.ఫారూఖ్ బాబు ఆధ్వర్యంలో యూనివర్సల్ సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ బులియన్ మర్చేంట్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయకుమార్ పాల్గొని ముందుగా కేక్ కట్ చేసి పాఠశాల లోని విద్యార్థులకు పంచిపెట్టారు. అనంతరం అభిమానులు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంనిర్వహించారు.ఈసందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ తండ్రికి తగ్గ తనయుడిగా రాణించటమే కాక,చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్లు చేయిస్తూ వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయడని, దేవుడు ఆయనకు ఆయురారొగ్యలతో పాటుగా చల్లగా చూడాలని కొరుకున్నారు.ఈ సందర్భంగా మహేష్ బాబు కు 48 వ జన్మదినశు భాకాంక్షలుతెలియజేశారు.అంతే కాక హీరో కృష్ణ మహేష్ బాబు అభిమానులు సేవా కార్యక్రమాలు చేయటం ద్వారాసంఘంలోమంచి గుర్తింపుపొందాలనిసూచించారు.నిర్వహించిన కార్యక్రమంలో అభిమానులుపి.వెంకటరావు,బి.కొండాలరావు,పాలపర్తి వెంకటేశ్వరరావు,షేక్.మస్తాన్ షరీఫ్,ధామస్,యమ్.సుబ్రమణ్య%శీ%,యమ్.చంద్రా,లింగంగుంట్ల రాములు,అన్నపురెడ్డి తిరుపతయ్య, కె.సుబ్బారావు, షంషీర్‌అలీ,నాగేశ్వరరావు, కుక్కల పౌలు,షేక్.నబి బాజీ, కొల్లిపరశ్రీను తదితరులు పాల్గొన్నారు.



# భీమాలో గోపీచంద్ తో రొమాన్స్ చేయనున్న ధనుష్ హీరోయిన్!




టాలీవుడ్ హీరో గోపీచంద్ కన్నడ దర్శకుడు ఎ హర్షతో యాక్షన్ డ్రామా భీమా కోసం చేతులు కలిపారు. ముఖ్యమైన చిత్రీకరణ దశను పూర్తి చేసిన తర్వాత, ఈ చిత్రం మళ్లీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. తాజా ప్రకటనలో, ప్రముఖ మహిళా పాత్ర కోసం ప్రియా భవానీ శంకర్‌ని ఎంపిక చేసినట్లు నిర్మాతలు వెల్లడించారు. తిరు నటి కళ్యాణం కమనీయం చిత్రంలో సంతోష్ శోభన్ సరసన తన టాలీవుడ్ అరంగేట్రం చేసింది.సత్య దేవ్ ప్రధాన పాత్రలో నటించిన జీబ్రాలో తదుపరి ఆడియెన్స్ ను ఆకట్టుకునేందుకు సిద్ధంగా ఉంది. భీమాలో, గోపీచంద్ పోలీసు పాత్రను పోషిస్తున్నారు. కెకె రాధామోహన్ సినిమా నిర్మాణానికి సపోర్ట్ చేస్తున్నారు. KGF సినిమాతో హిట్ కొట్టిన రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

# పవర్ ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్ గా "కింగ్ ఆఫ్ కోతా" ట్రైలర్




దుల్కర్ సల్మాన్ మరియు ఐశ్వర్య లక్ష్మి ప్రధాన పాత్రల్లో నటించిన కోలీవుడ్ చిత్రం కింగ్ ఆఫ్ కోతా ఈ ఓనం సందర్భంగా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. దీనికి ముందు, అభిలాష్ జోషి దర్శకత్వం వహించిన దాని థియేట్రికల్ ట్రైలర్‌ను ఈ రోజు ఆవిష్కరించారు. ట్రైలర్ పవర్ ఫుల్ గా ఉంది. అనేక యాక్షన్ సన్నివేశాలను కలిగి ఉంది.సినిమాపై ప్రేక్షకుల్లో ఉత్కంఠను రేకెత్తించేలా మేకర్స్ ట్రైలర్‌ను కట్ చేశారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరియు ఖచ్చితమైన యాక్షన్ కట్‌ల కలయిక ట్రైలర్ పై అంచనాలను పెంచేసింది. దుల్కర్ సల్మాన్ యొక్క ఫ్యాన్స్ కి ఇది పెద్ద ట్రీట్ అని చెప్పాలి. దుల్కర్ సల్మాన్ మరియు ఐశ్వర్య లక్ష్మితో పాటు, కింగ్ ఆఫ్ కోతాలో చెంబన్ వినోద్, షబీర్ (డ్యాన్స్ రోజ్), నైలా ఉష, షమ్మీ తిలకన్, శాంతి కృష్ణ, ప్రసన్న, గోకుల్ సురేష్, అనిఖా సురేంద్రన్, శరణ్ శక్తి మరియు అనేక ఇతర ప్రముఖ నటీనటులు కూడా ముఖ్యమైన పాత్రల్లో నటించారు. జీ స్టూడియోస్ సహకారంతో, వేఫేరర్ ఫిల్మ్స్ ఈ సినిమా ను నిర్మింస్తోంది. దీనికి షాన్ రెహమాన్ మరియు జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు.

# చిరంజీవి నెక్ట్స్ మూవీ పై ఇంట్రెస్టింగ్ బజ్



మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో, డైరెక్టర్ మెహర్ రమేష్ దర్శకత్వంలో తెరకెక్కిన మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ భోళా శంకర్ రేపు వరల్డ్ వైడ్ గా థియేటర్ల లో గ్రాండ్ గా రిలీజ్ కానుంది. తమన్నా భాటియా ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి మహతి స్వర సాగర్ సంగీతం అందించారు. అయితే, బింబిసార ఫేమ్ మల్లిడి విశిష్ట తో మెగాస్టార్ రాబోయే చిత్రం (మెగా 157) ఉన్నట్లు తెలుస్తోంది.ఈ చిత్రం గురించి ఒక ఇంట్రెస్టింగ్ బజ్ ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ రూమర్స్ నిజమైతే నవంబర్‌లో సినిమా అట్టహాసంగా ప్రారంభం కానుంది. దీనిపై మేకర్స్ ఇంకా అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. ప్రముఖ ప్రొడక్షన్ బ్యానర్ అయిన యూవీ క్రియేషన్స్ ఈ భారీ ప్రాజెక్ట్ ను నిర్మించనుంది. ఇది ఒక సోషియో ఫాంటసీ డ్రామా అని తెలుస్తోంది. ఈ చిత్రం కి సంబంధించిన వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

# 'బేబి' బ్యూటీ మాటకే ఓటేసిన కావ్య!



ప్రయత్నిస్తే తెలుగు సినిమాల్లో తెలుగు అమ్మాయిలకు ఛాన్స్ లు ఎందుకు రావు? అన్నది 'బేబి' బ్యూటీ వైష్ణవి చైతన్య బలమైన వాదన. ఎనిమిదేళ్లు ప్రయత్నించి బేబి సినిమాతో వైష్ణవి నిరూపించుకున్న సంగతి తెలిసిందే. యూ ట్యూబర్ గా ప్రారంభమై నేడు కుర్రాళ్ల గుండెల్లో వీణ మోగించేస్తోంది. వైష్ణవికి రకరకాల ఆఫర్లు వస్తున్నట్లు మీడియా కథనాలు వెడెక్కిస్తున్నాయి. అమ్మడు అంత డిమాండ్ చేస్తుందా? ఇంత డిమాండ్ చేస్తుందంటూ గాసిప్లు. బ్యాకెండ్ లో మెగా సపోర్ట్ కూడా కనిపిస్తుంది. ఇదే కోవలో ప్రణవి అనే మరో తెలుగు నటి కూడా తెలుగు వాళ్లకు అవకాశాలు వస్తాయి. అవి ఆలస్యమ వొచ్చు అంతే తేడా అంది. ఎంతకాలం అని పరభాష నటులపై ఆధారపడతారు? తెలుగు వాళ్లకు ఓ టైమ్ వస్తుంది. అప్పుడు తప్పక అవకాశాలు వస్తాయని ధీమా వ్యక్తం చేసింది. తాజాగా కావ్య కూడా వైష్ణవి మాటకే ఓటేసింది. 'నటిగా నా ప్రయాణం బాగుంది. 'మసూద'..'బలగం'.. ఇప్పుడు 'ఉస్తాద్' ముగ్గురు దర్శకులు తమ పాత్రలకి తెలుగు అమ్మాయి కావాలనుకున్నారు. అలా నాకు ఈ అవకాశాలు వచ్చాయి. ఆ కోణంలో తెలుగు అమ్మాయి అవ్వడం అదృష్టంగా భావిస్తున్నా. భాష వస్తేనే ఛాన్స్ వస్తుందని కాదు. నటన చాలా ముఖ్యం. భవిష్యత్ లో నేను తమిళ సినిమాలు చేయోచ్చు..మలయాళ సినిమాలు చేయోచ్చు. తెలుగు అమ్మాయిలకు అవకాశాలు రావడం లేదనే అంశంపై చర్చ అనవసరం అనిపిస్తుంది. శ్రీదేవి..సావిత్రి గొప్ప అవకాశాలు అందుకున్నారు. విజయాలు అందుకుని ఎప్పుడో తమని తాము నిరూపించుకున్నారు. దర్శకులకు ఫలానా పాత్రకు తెలుగు అమ్మాయి సూటవుతుందంటే తప్పకుండా వాళ్లనే పెట్టుకుంటారు. ఇక్కడ వాళ్ల ఛాయిస్ అనేది ముఖ్యం. వాళ్లు రాసుకున్న కథని బట్టి ఉంటుంది. తెలుగు వాళ్లకు ఇక్కడ మంచి భవిష్యత్ ఉంది. ఇప్పుడు పరిశ్రమలో చాలా మార్పులొచ్చాయి. కొత్త వాళ్లని బాగా ప్రోత్సహిస్తున్నారు. ప్రతిభ ఉన్న వారంతా సక్సెస్ అవుతున్నారు. ఆ రకంగా మనం సన్నదం కావడం అన్నది అతి ముఖ్యమైన అంశం' అని అంది.

# ఎన్టీఆర్..చిరంజీవి లా పవన్ ఎదిగేవారు!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా కెరీర ప్రారంభించి రెండున్నర దశాబ్దాలవుతుంది. ఇన్నేళ్లలో ఆయన కేవలం 30కి పైగానే సినిమాలు చేసారు. 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయ్' నుంచి తాజా ప్రాజెక్ట్ 'ఉస్తాద్ భగత్ సింగ్' ని కలుపుకుంటే తేలిన లెక్క అది. కేవలం పవన్ ఏడాదికి ఒక్క సినిమా చేసుకుంటూ రావడం వల్ల ఇన్ని తక్కువ సినిమాలు చేయగలిగారు. ఒకటి రెండేళ్లలో రెండు సినిమాలు చేసారు తప్ప! అంతకు మించి పవన్ వేగం ఎక్కడా కనిపించదు. భారీగా రెమ్యునరేషన్ అయితే ఈ మధ్య రాజకీయాల్లో బిజీ అయిన తర్వాత సినిమాల వేగం కాస్త పెంచారు. అది కూడా అనివార్య కారణాల వల్ల డబ్బు అవసరం ఏర్పడటంతోనే సినిమాలు స్పీడ్ పెంచినట్లు చెప్పొచ్చు. ఆరకంగా అభిమానుల కోరిక కొంత వరకూ నెరవేరుతుంది. ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టిన తర్వాత పీకే సినిమాలకు రిటైర్మెంట్ ఇచ్చేస్తారని..రెండు పడవల ప్రయాణం అంత శ్రేయస్కరం కాదని భావించి పవన్ జనసేన తో ప్రజల సేవకే అంకితమవుతారని ఆయన సహా చాలా మంది భావించారు. కానీ పవన్ వదిలేద్దాం అన్నా..పరిశ్రమ ఆయన్ని వదలడం లేదు. తాజాగా పవన్ కళ్యాణ్ కెరీర్ జర్నీని ఉద్దేశించి సీనియర్ రచయిత పరుచూరి గోపాలకృష్ణ ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. 'పవన్ కళ్యాణ్ బాగుండాలని కోరుకునేవారిలో నేను ఒకడిని. పవన్ సినిమాలు ఆపకూడదు. ఇలాగే కొనసాగించాలి. సమయం లేకపోతే సీనియర్ ఎన్టీఆర్ లా అప్పుడప్పుడైనా సినిమాల్లో కనిపించాలి. ఆయన సినిమాలు గ్యాప్ లేకుండా ఎక్కువ సినిమాలు చేసినట్లు అయితే ఇప్పటికే ఎన్టీఆర్..చిరంజీవిలా పదిహేనళ్లకే ఇంకా ఉన్నత శిఖరాలకు చేరుకునేవారు.

కానీ ఆయన గ్యాప్ కొంతవరకూ వెనక్కి లాగుతుంది. ప్రజల్లో..ప్రేక్షకుల్లో ఎంతో బలమైన నటుడు. సినిమాలు ఆపకూడదు. ఆయన కోరుకున్న రంగంతో పాటు సినిమాలు కొనసాగించాలి. సమాజం మారాలని..అధికారం ఒకరి చేతుల్లోనే ఉండకూడదని పాటు పడుతున్నారు. ఇక పవన్ నటించిన బ్రో సినిమా సాయితేజ్ ప్రమోషన్ కోసం చేసినట్లు ఉంది' అని అన్నారు.

# మహేశ్ బాబుకు పోటీగా ఎన్టీఆర్..



ఇండస్ట్రీలో హీరోలు, హీరోయిన్లు.. కేవలం సినిమాల్లోనే కాదు ఇతర వ్యాపారాలు చేస్తుంటారు. అలానే ఇతర కంపెనీల బ్రాండ్ ప్రమోషన్స్ కూడా చేస్తుంటారు. అయితే ఈ బ్రాండ్ ప్రమోషన్స్ కోసం టాలీవుడ్ లో ఎంతో మంది హీరోలున్నా.. ఎక్కువగా టాప్ కంపెనీలన్నీ సూపర్ స్టార్ మహేశ్ బాబు చుట్టూనే తిరుగుతుంటాయి. ఆ తర్వాత అల్లు అర్జున్, ఈ మధ్య విజయ్ దేవరకొండ ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే మహేశ్ బాబు ఈ సినిమాల కన్నా.. యాడ్స్, బ్రాండ్ ప్రమోషన్స్ ద్వారానే ఎక్కువ ఆర్జిస్తారని కూడా మాటలు వినిపిస్తుంటాయి. భారీ స్థాయిలో రెమ్యునరేషన్ ఛార్జ్ చేస్తారట. అయితే ఇప్పుడు ఆర్ఆర్ఆర్ తో బిగ్గెస్ట్ హిట్ అందుకున్న ఎన్టీఆర్ కూడా ఈ బ్రాండ్ ప్రమోషన్స్ లో కాస్త ఎక్కువగానే కనిపిస్తున్నారు. ఆయన ఇప్పుడీ యాడ్స్ కోసం చేసే ఛార్జ్ ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. మహేశ్ తీసుకునే పారితోషికానికి దాదాపుగా మ్యాచ్ అయ్యేలా తారక్ కూడా తీసుకుంటున్నారని అంటున్నారు. తాజాగా తారక్.. గుబురు గడ్డం, కళ్ళజోడు, సూపర్ హెయిర్ స్టైల్ తో వావ్ అనిపించేలా కనిపించి సర్ ప్రైజ్ చేశారు. ఇది ఓ ప్రముఖ యాడ్ షూటింగ్ అని వార్తలు వచ్చాయి. దీని కోసం ఆయన దాదాపు రూ. 8 నుంచి రూ. 10కోట్లు తీసుకున్నారని ప్రచారం సాగింది. అంతే కాకుండా మరో రెండు బడా బ్రాండ్ ప్రమోషన్స్ కు కూడా సైన్ చేశారట. వీటికి కూడా బాగానే ఛార్జ్ చేశారని సమాచారం అందింది. అంతకుముందు రీసెంట్ గా లీషియస్ ఫుడ్, యాపీ ఫిజ్, మెక్ డొనాల్డ్స్ వంటి ప్రకటనలతో ఆడియెన్స్ ముందుకు వచ్చారు తారక్. ఈ ప్రకటనల కోసం ఆ సంస్థలు ఎన్టీఆర్ కు భారీగానే పారితోషికం ఇచ్చాయని వార్తలు వచ్చాయి. దీని బట్టి ఇప్పుడు ఎన్టీఆర్ కూడా బ్రాండ్ ప్రమోషన్లలో జోరు చూపిస్తున్నారని, మహేశ్ కు పోటీగా ఆయన రేంజ్ కు దగ్గరగా ఛార్జ్ చేస్తూ రెమ్యునరేషన్ అందుకుంటున్నారని బయట మాటలు వినిపిస్తున్నాయి. మొత్తంగా యాడ్స్ రెమ్యునరేషన్ విషయంలో మహేశ్ కు చేరువలో తారక్ ఉన్నారని చెబుతున్నారు. ఇకపోతే ఎన్టీఆర్ ప్రస్తుతం దేవర సినిమాలో నటిస్తున్నారు. 'జనతా గ్యారేజ్' వంటి బ్లాక్ బస్టర్ హిట్ మూవీ తర్వాత ఎన్టీఆర్ – కొరటాల కాంబోలో రానున్న సినిమా ఇది. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. ఈ చిత్రంతో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ టాలీవుడ్ అరంగేట్రం చేస్తోంది. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు.


## మాస్టర్ కీ టీవీ ఛానల్

మీడియాలో స్వతంత్ర్య యజమానిగా హక్కులు తీసుకోవడానికి ఆహ్వానం

మీ వార్తకు మీరే యజమాని..!

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో ఉన్న టీవీ ఛానెల్స్ అన్నీ.. మూడు పొలిటికల్ పార్టీలుగా విడిపోయి వారు ఆయా పార్టీలకు అనుకూలమైన వార్తలను ప్రసారం చేస్తూ ప్రజల సమస్యలను పట్టించుకోవటం లేదు.

ఈ దేశం బాగుండాలని కోరుకునే ప్రతి ఒక్కరి మనోభావాలను, సమస్యలను ప్రతీ రోజు మీరు పంపిన యెడల వాటిని మా ఛానెల్ ద్వారా ప్రసారం చేయబోతున్నాం.

ప్రతి పౌరుడికి మీడియా ద్వారా ఎంపవర్ చేయడమే మా ధ్యేయం. ఈ సాధికారత వల్ల ప్రజలు తమ సమస్యల పట్ల చైతన్యం కలిగి సమాజ శ్రేయస్సుకు చేయూతనివ్వగలుగుతారు.

ఇందుకు మీకు కలిగే లాభాలు :

1. సొంత సమస్యలు గాని, ప్రజా సమస్యలు గాని పరిష్కారం అయ్యే మార్గాలు.
2. నాయకునిగా ఎదిగే అవకాశం
3. మీ ద్వారా వచ్చే ప్రకటనలపై 50 - డిస్కౌంట్.
4. మీ పెట్టుబడి ఎక్కువ రేట్లు అయ్యే అవకాశం.

ఇందుకు మీరు చేయవలసిందల్లా వాటాదారునిగా చేరటమే.

మీరు మీ కుటుంబ సభ్యులందరూ కలిపి స్వతంత్ర్య యజమానిగా హక్కులు తీసుకోవడానికి రూ. 2 లక్షలు అంతకు మించిన విలువ చేసే వాటాలు తీసుకోవాలి.

మీకు కావాలంటే 2026 వ సంవత్సరం తర్వాత మీ వాటాలను మార్కెట్లో తిరిగి అమ్ముకునే అవకాశం ఉంటుంది.

ప్రస్తుతం కేబుల్ టీవీ ఛానెల్ గా ఉన్న మాస్టర్ కీ టీవీ త్వరలోనే శాటిలైట్ ఛానెల్ గా మారనుంది.

పతి ఒక్కరినీ భాగస్వాములు కావాల్సిందిగా ఆహ్వానిస్తున్నాం. రాజ్యాధికార సాధనకు MAMలో భాగమైన మీడియాను బలోపేతం చేద్దాం.

రండి..! కదలి రండి..!

వివరాలకై సంప్రదించండి...

91549 58315 - 76600 27683


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16. and SREE SESHASAI ENTERPRISES "D.NO : 3-88, "C/O CHANDRA THEATER," GOSALA VILLAGE, "MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com
PIN: 521151."MOBILE :9912333140 Email : sreeseshasaivja@gmail.com.